www.prajanaava.in
Telugu Daily
# ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పేజీలు : 08 | వెల : 5.00

ప్రజానావ
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న
ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలిస్తుంది!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
✆ : 99484 33277 / 7288825681

Published from: **Karimnagar,** Circulated to: **Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad** | హైదరాబాద్ | సంపుటి : 2 | సంచిక : 67 | మంగళవారం | 20 ఆగస్టు 2024



దేశవ్యాప్తంగా రాఖీ పౌర్ణమి పండుగను ఘనంగా జరుపుకున్నారు.. రక్షా బంధన్ ను పురస్కరించుకుని ప్రధానమంత్రి నరంద్రమోడీకి చిన్నారులు రాఖీ కట్టారు. సోమవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో పలు పాఠశాలల విద్యార్థులతో కలిసి రక్షా బంధన్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బాలికలతో ప్రధాని మోడీ ప్రత్యేకంగా మాట్లాడారు. వారితో కలిసి సరదాగా పండుగను జరుపుకున్నారు. ప్రధాని మోడీకి చిన్నారులు రంగు రంగుల రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. సందర్భంగా ప్రధాని మోడీ.. రాఖీ వేడుకలకు సంబంధించిన చిత్రాలను, వీడియోలను ఎక్స్ లో షేర్ చేశారు.



రాష్ట్ర వ్యాప్తంగా రాఖీ పండుగ సంబురాలు ఘనంగా కొనసాగాయి. జూబ్లీహిల్స్‌లో నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి సీతక్కతో పాటు పలువురు రాఖీ కట్టారు.రాఖీ పౌర్ణమి పర్వదినం సందర్భంగా జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి సీతక్క రాఖీ కట్టారు. సీతక్కతో పాటు ఎంపీ కావ్య, ఎమ్మెల్యేలు పర్ణిక రెడ్డి, రాగమయి, కార్పొరేషన్ చైర్మన్లు బండ్రు శోభారాణి, నెరేళ్ల శారద, కాల్వ సుజాత, తదితరులు రేవంత్ రెడ్డికి రాఖీలు కట్టారు.

## తెలంగాణకు రాజీవ్‌కు ఏం సంబంధం

- సచివాలయం ఎదురు విగ్రహాన్ని ఆమోదించం
- బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే తొలగిస్తాం
- విమానాశ్రయం తదితర పేర్లు కూడా మార్చేస్తాం
- కాంగ్రెస్ నిర్ణయంపై మండిపడ్డ బీఆర్ఎస్ నేత కేటీఆర్


2 లో..



## రిజర్వేషన్లపై రాహుల్ వ్యాఖ్యలు

- అవగాహన లేదని కొట్టివేత
- ఘాటుగా స్పందించిన కేంద్రమంత్రి మేఘవాల్

2 లో..



దేశ క్రీడారంగానికి కేంద్ర బిందువుగా తెలంగాణ ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. ఇందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం సచివాలయంలో ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ యూనివర్సిటీపై ఆయన వారితో చర్చించారు. ఫోర్త్ సిటీలో ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏవిధంగా ఉండాలనే దానిపై పలు సూచనలు చేశారు.



# దేశ క్రీడారంగానికి కేంద్ర బిందువుగా తెలంగాణ

- స్పోర్ట్స్ యూనివర్సిటీలో ప్రతి క్రీడకు ప్రాధాన్యం
- క్రీడాకారులను గుర్తించి ప్రోత్సాహక శిక్షణ ఇవ్వాలి
- యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ సీఎం రేవంత్ సమీక్ష

**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:**

యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో ప్రతి క్రీడకు ప్రాధాన్యం ఉండాలని, అన్ని రకాల క్రీడలను, క్రీడా శిక్షణ సంస్థలను ఒకే గొడుగు కిందకు తేవడమే స్పోర్ట్స్ యూనివర్సిటీ లక్ష్యమన్నారు. మన దేశంతో పాటు తెలంగాణలోని భౌగోళిక పరిస్థితులు, మన శారీర నిర్మాణ తీరుకు అనువైన క్రీడలు ఏవో గుర్తించి, క్రీడలపై ఉత్సాహం ఉన్న వారిని గుర్తించి వారిని ఆయా క్రీడల్లో ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. దశాబ్దాల క్రితమే ఆఫ్రో-ఏషియన్ గేమ్స్, కామన్‌వెల్త్ గేమ్స్‌కు ఆతిథ్యమిచ్చిన హైదరాబాద్‌ను భవిష్యత్తులో ఒలింపిక్స్‌కు వేదికగా మార్చాలని ముఖ్యమంత్రి అన్నారు. హైదరాబాద్‌లో ఒలింపిక్స్ నిర్వహించడమే కాకుండా ప్రతి క్రీడలో మన క్రీడాకారులు పతకాలు దక్కేలా వారిని తీర్చి దిద్దాలని, అందులో మన స్పోర్ట్స్ యూనివర్సిటీ క్రీడాకారులు కచ్చితంగా ఉండాల్సిదేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

మిగతా 2 లో

# రూ.5వేల కోట్లతో 120 గురుకుల భవనాలు

స్థలాల ఎంపిక.. డిజైన్లు పూర్తి చేయాలి
అధికారులతో సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి



**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:**

తెలంగాణ వ్యాప్తంగా ఈ ఏడాది రూ.5వేల కోట్లతో 30 ప్రాంతాల్లో 120 గురుకుల పాఠశాల భవనాలు నిర్మించనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. సమీకృత గురుకుల సముదాయాల కోసం నియోజకవర్గాల్లో స్థలాలు, డిజైన్ల ఎంపిక వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల ఉన్నతాధికారులతో డిప్యూటీ సీఎం సమీక్ష నిర్వహించారు.

## రాజ్యసభ అభ్యర్థిగా సింఘ్వీ నామినేషన్

కార్యక్రమంలో పాల్గొన్న సీఎం రేవంత్, మంత్రులు

2 లో..

## తెలుగు రాష్ట్రాల్లో ఉపరితల ఆవర్తన ద్రోణి

- రానున్న మూడు రోజులు భారీ వర్షాలు
- పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వానలు
- హైదరాబాద్ నగరంలో దంచికొట్టిన వాన
- పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ ఇబ్బందులు

2 లో..



## కాశ్మీర్‌లో ఉగ్రవాదుల మెరుపుదాడి

### దాడిలో సీఆర్పీఎఫ్ ఉన్నతాధికారి మృతి

**శ్రీనగర్ :**

జమ్మూ కశ్మీర్‌లో ఉదంపూర్ జిల్లాలోని దుదు ప్రాంతంలో సోమవారం ఉగ్రవాదులు మెరుపు దాడికి దిగారు. ఈ దాడిలో సీఆర్పీఎఫ్ ఉన్నతాధికారి మరణించారు. దుదు ప్రాంతంలో సీఆర్పీఎఫ్ బెటాలియన్‌ను మరింతగా మోహరించేందుకు భారత సైన్యం చర్యలు చేపట్టింది. ఆ క్రమంలో బెటాలియన్‌పై ఉగ్రవాదులు మెరుపు దాడికి దిగి.. కాల్పులు జరిపారు. దీంతో సీఆర్పీఎఫ్ అధికారి మరణించారు.

మిగతా 2 లో

## సీఎం సిద్ద రామయ్యకు తాత్కాలిక ఉపశమనం

ఎలాంటి చర్యలు తీసుకో వద్దని హైకోర్టు ఆదేశం

2 లో..

# దేశ క్రీడారంగానికి కేంద్ర బిందువుగా తెలంగాణ

(మొదటిపేజీ తరువాయి)

ఇందుకోసం వారికి నిపుణులైన శిక్షకులతో శిక్షణ ఇప్పించాలన్నారు. అన్ని యూ నివర్సిటీల్లోని క్రీడా విభాగాలు, ప్రభుత్వ ఆధ్వ ర్యంలోని క్రీడా పాఠశాలలు, అకాడమీలు, క్రీడా శిక్షణ సంస్థలు అన్నింటిని స్పోర్ట్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. స్పోర్ట్స్ యూనివర్సిటీలో మన దేశ క్రీడాకారులు ఒలింపిక్స్‌లో రాణించే షూటింగ్, రెజ్లింగ్, బాక్సింగ్, అర్చరీ, జావెలిన్ త్రో, హాకీకి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని, ఆ తర్వాత శిక్షణ ద్వారా పతకాలు సాధించే అవకాశాలు ఉన్న క్రీడల్లో శిక్షణ ఇప్పించాలని సూచించారు. యూనివర్సిటీలో ఆయా క్రీడల్లో శిక్షణకు అవసరమైన వసతులు, ఆహారంతో అంతర్జాతీ య స్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఉన్నతనంలోనే విద్యార్థుల్లో ఉన్న క్రీడా నైపుణ్యాలు, వారికి ఏ క్రీడలపై మక్కువ ఉందో ఉపాధ్యాయలు గుర్తించాలని ముఖ్యమంత్రి సూచించారు. అటువంటి విద్యార్థులందరికీ ఆయా క్రీడల్లో శిక్షణ ఇచ్చేలా ప్రతి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఒక స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు చేయాలన్నారు. ఆ పాఠశాలల్లో విద్యా బోధనతో ఉంటుందని అయితే క్రీడలకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుందని, విద్యార్థులకు అక్కడ వారికి నచ్చిన క్రీడల్లో శిక్షణ ఇచ్చి, ప్రతిభ ఆధారంగా వారికి స్పోర్ట్స్ యూనివర్సిటీలో వసతి కల్పించి మరింత పదును తేలేలా శిక్షణ ఇప్పించాలన్నారు. హైదరాబాద్‌లోని స్పోర్ట్స్ యూనివర్సిటీ దేశా క్రీడా రంగానికి కేంద్ర బిందువుగా ఉండాలని, అందుకోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఇటీవల ఒలింపిక్స్‌లో పతకాలు సాధించిన దేశాలు, క్రీడాకారుల వివరాలను సేకరించి, ఆయా క్రీడాకారులు పతకాల సాధనకు శ్రమించిన తీరు, ఆయా దేశాలు వారిని ప్రోత్సహించిన తీరు, వారికి ఇచ్చిన శిక్షణ, ప్రోత్సాహం తదితరాలపై అధ్యయనం చేసి సమగ్ర నివేదిక రూపొందించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఇప్పటికే స్కిల్ యూనివర్సిటీకి యంగ్ ఇండియా పేరు పెట్టామని, స్పోర్ట్స్ యూనివర్సిటీ యంగ్ ఇండియా పేరు ఖరారు చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌కు యంగ్ ఇండియా పేరు పెడతామని ముఖ్యమంత్రి వెల్లడించారు. తెలంగాణ యంగ్ ఇండియాకు బ్రాండ్‌గా మారాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. క్రీడా నైపుణ్యాల్లో తెలంగాణ ఒక శక్తిమంతమైన రాష్ట్రంగా గుర్తింపు పొందడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.



# రూ.5వేల కోట్లతో 120 గురుకుల భవనాలు

(మొదటిపేజీ తరువాయి)

గురుకులాల ఏర్పాటుకు గ్రామీణ ప్రాంతాల్లో 15 నుంచి 25 ఎకరాలు, పట్టణాల్లో 10 నుంచి 15 ఎకరాల భూమి సేకరించాలన్నారు. గురుకులాల్లో అవసరమైన సదుపాయాలపై ఈ నెల 29లోగా నివేదిక సమర్పించాలని విద్యాశాఖను ఆదేశించారు. ఈ సమీక్షలో మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా పాల్గొన్నారు. విదేశాల్లో చదువుతున్న విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్ రెండో విడత నిధులను వెంటనే విడుదల చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ వినతిపై డిప్యూటీ సీఎం భట్టి సానుకూలంగా స్పందించా రు. పెండింగులో స్కాలర్‌షిప్ బకాయిల జాబితా ఇవ్వాలని అధికారులకు తెలిపారు. నిర్ణీత గడువులోగా ఓవర్సీస్ స్కాలర్‌షిప్ నిధుల ను విడుదల చేయించుకునే బాధ్యత అధికారులదేనని చెప్పారు.

# తెలంగాణకు రాజీవ్‌కు ఏం సంబంధం

## కాంగ్రెస్ నిర్ణయంపై మండిపడ్డ బీఆర్ఎస్ నేత కేటీఆర్

**హైదరాబాద్, ప్రజానావ:** తెలంగాణ సచివాలయం ఎదుట రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టడమంటే తెలంగాణ ఆత్మగౌరవంపై దాడి చేసినట్లేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. అక్కడ తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాలనుకున్నట్లు వెల్లడించారు. రాఖీ వేడుకల్లో పాల్గొన్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయాలపై మండిపడ్డారు. రాజకీయాల్లో అధికారం, పదవులు శాశ్వతం కాదన్నారు. రాష్ట్ర ఆత్మగౌరవాన్ని చాటేలా కేసీఆర్ సచివాలయాన్ని కడితే.. కాంగ్రెస్ సర్కారు రాజీవ్ విగ్రహం చేయడమేంటని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా కాంగ్రెస్ వ్యవహరిస్తోందని.. తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాల్సిన చోట రాజీవ్‌గాంధీ విగ్రహం పెడుతున్నారని ధ్వజ మెత్తారు. తెలంగాణకు, రాజీవ్‌కు ఏం సంబం ధం ఉందని ప్రశ్నించారు. వందలమంది ప్రాణాలు తీసిన నాయకుడి విగ్రహం పెడతారా ? నిలదీశారు.

తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాల్సిన చోట రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు చేయడం దారుణమన్నారు. ప్రస్తుతం విగ్రహాన్ని పెట్టినా బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే తొలగించి తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేస్తామని తేల్చి చెప్పారు. అలాగే, రాష్ట్రంలో రాజీవ్ పేరుతో ఉన్న రింగ్ రోడ్డు, హైదరాబాద్ విమానాశ్రయం సహా ఇతర సంస్థల పేర్లను సైతం మారుస్తామని కేటీఆర్ హెచ్చరించారు. తెలంగాణలో ఇందిరా గాంధీ, రాజీవ్ పేర్లతో హైదరాబాద్‌లో చాలానే ఉన్నాయన్న కేటీఆర్.. కాంగ్రెస్ ఇప్పటికైనా మారకుంటే అధికారంలోకి వచ్చాక మారుస్తామని తేల్చిచెప్పారు. ఇప్పటికైనా కాంగ్రెస్ మనసు మార్చుకుని అక్కడ తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి రాజీవ్ గాంధీ విగ్రహాన్ని గాంధీ భవన్‌లో పెట్టుకో లేకపోతే జూబ్లీహిల్స్‌లో లేదంటే.. ఇంట్లో పెట్టుకోవాలన్నారు. అంతేగానీ తెలంగాణ తల్లిని అవమానిస్తే ఊరుకోమన్నారు.

# విద్యుత్ షాక్‌తో దంపతులు మృతి

## బట్టలు ఆరేస్తుండగా దుర్ఘటన

**ఖమ్మం, ప్రజానావ:** పండుగపూట విషాదం చోటు చేసుకుంది. విద్యుత్ షాక్‌తో దంపతులు మృతి చెందారు. ఈ విషాదకర ఘటన ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం బస్వాపురం గ్రామం లో సోమవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. బస్వాపురం గ్రామానికి చెందిన బానోతు శ్రీను(42), షమీన(40)లు దాదాపు 20 ఏళ్ల క్రితం ప్రేమ పెళ్లి చేసుకున్నారు. అన్యోన్యంగా సాగిపోతున్న వారి దాంపత్య జీవితంలో ఓ కుమార్తె ప్రియాంక జన్మించింది. భార్యాభర్తలిద్దరూ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. అయితే ఉదయం బట్టలు ఉతికిన షమీన ఇంటి ముందున్న ఇనుప తీగపై ఆరేస్తుండగా.. ఆ తీగకు విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌తో అక్కడికక్కడే పడిపోయింది. అదే సమయంలో వారి ఇంటికి వచ్చిన ఓ వ్యక్తి షమీన కిందపడి ఉండటాన్ని గమనించి ఇంట్లో ఉన్న ఆమె భర్త శ్రీనుకు చెప్పాడు. కొంత కాలంగా అనా రోగ్యంతో బాధపడుతున్న షమీన అప్పుడప్పుడు స్పృహతప్పి పడిపోతూ ఉండేది. అలాగే పడిపోయిందను కున్న శ్రీను తన భార్యను లేపేందుకు యత్నించాడు. దీంతో అతడికి కూడా విద్యుత్ షాక్ తగిలి కుప్పకూలిపోయాడు. దీనిని గమనించిన శ్రీను స్నేహితుడు కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి ఆ దంపతులను వెంటనే ఇల్లెందు ప్రభుత్వ దవాఖానకు తరలిం చారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. రాఖీ పౌర్ణమి రోజు భార్యభర్తలిద్దరూ ప్రమాదవశాత్తు మృత్యువాత పడడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుల కుమార్తె ప్రియాంక ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

## మోడీ ఉక్రెయిన్ పర్యటన ఖరారు

**న్యూఢిల్లీ, ఆగస్టు 19 :** రష్యా దండయాత్రతో గత రెండేళ్లకు పైగా యుద్ధ భూమిలో నలిగిపోతున్న ఉక్రెయిన్‌లో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన ఖరారైంది. ఆగస్టు 23న ఆయన కీవ్‌ను సందర్శిస్తారని కేంద్ర విదేశాంగ శాఖ వెల్లడించింది. ఇది ఎంతో ప్రాధాన్యత కలిగిన పర్యటన అని తెలిపింది. ఉక్రెయిన్‌లో వివాదం పరిష్కరించేందుకు భారత్ ఎల్లప్పుడూ దౌత్యం, చర్చలను సమర్థిస్తుందని స్పష్టం చేసింది. ఆగస్టు 23న ప్రధాని మోదీ ఉక్రెయిన్ దేశాధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీతో భేటీ కానున్నారు. ఉక్రెయిన్‌లో కొనసాగుతున్న యుద్ధం అంశంపైనా ఇరువురు నేతలు చర్చించనున్నారు. ఉక్రెయిన్ కంటే ముందు ప్రధాని పోలండ్‌లో పర్యటించనున్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో ఉపరితల ఆవర్తన ద్రోణి

**విజయవాడ/హైదరాబాద్, ప్రజానావ:** తెలుగు రాష్ట్రాల్లో ఉపరితల ఆవర్తనం ద్రోణి ప్రభావంతో రానున్న మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. ఉత్తర కర్ణాటకను ఆనుకుని ఉన్న తెలంగాణలో ఆవర్తనం విస్తరించి ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. దీంతో ఐఎండీ రైన్ అలర్ట్ జారీ చేసింది. భారీ వర్షాలకు తోడుగా గంటకు 30 నుంచి 40 కి.మీ. వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందన్నారు. ఉరుములు, మెరుపులతోపాటు పిడుగులు పడే అవకాశం ఉందని, ప్రజలు జాగ్రతగా ఉండాలని ఐఎండీ సూచించింది. పొలం పనులకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలని చెట్లకింద. బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదని ఐఎండీ పేర్కొంది. తెలంగాణలో వర్షాలు దంచికొడు తున్నాయి. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాబోయే 3 రోజుల పాటు తెలంగాణలో వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. ఈ క్రమంలో పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. ఆదివారం 25 జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే అవకాశం ఉందని వెల్లడిరచింది. ఆదిలాబాద్, మంచిర్యాల, సిరిసిల్ల, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశారు. సిద్దిపేట, యాదాద్రి, రంగారెడ్డి, హైదరాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని ఐఎండీ వెల్లడిరచింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఉపరితల ఆవర్తనం ద్రోణి ప్రభావంతో ఏపీలోనూ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. రాయలసీమలోని కర్నూలు, అనంతపురం, సత్యసాయి, కడప, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లోనూ వర్షాలు కురుస్తాయన్నారు. కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు, ప్రకాశం, నంద్యాల జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు వెల్లడిరచారు. కోనసీమ, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, పల్నాడు జిల్లాల్లోనూ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. తెలంగాణలో రాగల మూడు రోజుల వరకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కొన్ని చోట్ల కురిసే అవకాశం ఉంది. ఆదివారం రోజు ఉత్తర అంతర్గత కర్ణాటక మరియు పరిసర తెలంగాణ ప్రాంతం వద్ద కొనసాగిన ఆవర్తనం ఈరోజు రాయలసీమ మరియు దాని పరిసర ప్రాంతాలలో సగటు సముద్ర మట్టానికి 0.9 కి. మీ ఎత్తు వరకు విస్తరించి కొనసాగుతోంది. నిన్నటి ద్రోణి, ఈరోజు రాయలసీమ మరియు దాని పరిసర ప్రాంతాలలో కొనసాగుతున్న ఆవర్తనం నుంచి తమిళనాడు మీదుగా కోమరిన్ ప్రాంతం వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కి. మీ ఎత్తులో కొనసాగుతున్నది. ఈ కారణంగా తెలంగాణలో వర్షాలు కురుస్తున్నాయి. ఈరోజు తెలంగాణ రాష్ట్రంలో కొన్ని జిల్లాలలో భారీ వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. రాగల మూడు రోజుల్లో తెలంగాణలో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కి. మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడిరచింది. హైదరాబాద్‌లో పలుచోట్ల భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా దంచి కొట్టిన వర్షం కారణంగా వాహనదారులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. మాన్?సూన్ టీమ్స్ రోడ్లపై వాటర్ లాగింగ్ ఏరియా క్లియర్ చేస్తుంటే.. పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేసే పనిలో తలమునకల్కె ఉన్నారు. హైదరాబాద్ నగరంలో పలుచోట్ల ఉన్నట్టుండి భారీ వర్షం కురిసింది. ఉరుములు లేవు. మెరుపులు లేవు. కాసేపట్లో మబ్బులు కమ్మాయి. కుండపోత కురిసింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, ఖైరతాబాద్, నాంపల్లి, కోఠితో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం కారణంగా భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. వాహనదారుల ఇక్కట్లు మాటలతో వర్ణించలేం. మాసబ్‌ట్యాంక్, ప్యారడైజ్, షేక్ పేట్ నాలా, రసూల్‌పుర, బేగంపేట, ఎన్టీఆర్ భవన్, జూబ్లీచెక్ పోస్ట్‌లో ట్రాఫిక్ జామ్ కారణంగా వాహనదా రులు చాలా ఇబ్బంది పడ్డారు. జీహెచ్ఎంసి, ట్రాఫిక్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ నగర ప్రజలను హెచ్చరించారు. సోమవారం మధ్యాహ్నం నుంచి ఎడతెరపి లేకుండా కుండ పోతగా వర్షం కురుస్తోంది. దీంతో పలు ప్రాంతాలు జలమయమైనాయి. ఈ వర్షం కారణంగా.. ఆ యా ప్రాంతాల్లో ట్రాఫిక్ భారీగా స్తంభించింది. ఒక్కసారిగా వర్షం ప్రారంభం కావడంతో.. వాహనాదారులు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోవైపు హైదరాబాద్ నగరంలో పలు ప్రాంతాల్లో సోమవారం భారీ వర్షం కురుస్తుందని వాతావరణ కేంద్రం ఇప్పటికే వెల్లడిరచింది. దీంతో ఎల్లో అలర్ట్‌ను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇంకోవైపు.. రానున్న మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్‌లోని వాతావరణ కేంద్రం వెల్లడిరచింది. పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలుల కూడిన వానలు పడతాయని వెల్లడిరచింది. ఆగస్టు 20వ తేద వరకు తెలంగాణలోని అత్యధిక జిల్లాల్లో భారీ వర్షాలు పడతాయని వాతావరణ కేంద్రం పేర్కొంది. ఈ నేపథ్యంలో ఎల్లో అలర్ట్ జారీ చేసిన విషయం విదితమే.



# సీఎం సిద్దరామయ్యకు తాత్కాలిక ఉపశమనం

## ఎలాంటి చర్యలు తీసుకో వద్దని హైకోర్టు ఆదేశం

**బెంగళూరు, ఆగస్టు 19 :** కర్ణాటక సీఎం సిద్దరామయ్యకు హైకోర్టులో తాత్కాలిక ఉపశమనం లభించింది. ఆగస్టు 29వ తేదీ వరకు ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ట్రయిల్ కోర్టును కర్ణాటక హైకోర్టు ఆదేశించింది. ముడా కుంభకోణంలో సీఎం సిద్దరామయ్యను ప్రాసిక్యూషన్ చేసేందుకు ఆ రాష్ట్ర గవర్నర్ తవర్‌చంద్ గెహ్లోత్ అనుమతి ఇస్తూ ఆదేశాలు జారీ చేశారు. గవర్నర్ ఆదేశాలను నిలిపి వేయాలంటూ సీఎం సిద్దరామయ్య సోమవారం హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ రిట్ పిటిషన్‌పై సింగిల్ బెంచ్ జడ్జి హేమంత్ చందన్‌గౌడ్ ఆధ్వర్యంలో విచారణ జరిగింది. ఈ సందర్భంగా సీఎం సిద్దరామయ్య తరపు న్యాయవాదీ అభిషేక్ మను సింఘ్వీ తన వాదనలను వినిపించారు. ఆ క్రమంలో ఆగస్టు 29వ తేదీ వరకు సీఎం సిద్దరామయ్యను ఎలాంటి విచారణ జరప వద్దని న్యాయమూర్తికి వివరించారు. దీంతో న్యాయవాది సింఘ్వీ వాదనలతో సింగిల్ జడ్జి జస్టిస్ హేమంత్ చందన గౌడ్ ఏకీభవించారు. దీంతో ఆగస్టు 29వ తేదీ వరకు ఆయనపై ఎటువంటి చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. మైసూర్ నగరాభివృద్ధి సంస్థ (ముడా) కుంభకోణంలో సీఎం సిద్దరామయ్య ప్రమేయం ఉందంటూ.. సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణ, టీజే అబ్రహం తదితరులు.. ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో సీఎం సిద్దరామయ్యను ప్రాసిక్యూషన్ చేసేందుకు ప్రత్యేక కోర్టుకు గవర్నర్ తావర్ చంద్ గెహ్లోత్ ఆగస్టు 17వ తేదీన అనుమతి ఇస్తూ.. ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలను వెంటనే రద్దు చేయాలంటూ సిఎం సిద్దరాయమ్య.. సోమవారం హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ రిట్ పిటిషన్‌ను సోమవారం సింగిల్ జడ్జి జస్టిస్ హేమంత్ చందన్ గౌడ్ విచారించారు. సీఎం సిద్దరామయ్యను ఆగస్టు 29వ తేదీ వరకు ప్రాసిక్యూషన్ చేయకూడదంటూ సింగిల్ జడ్జి జస్టిస్ హేమంత్ చందన్ గౌడ్ ఆదేశించారు. దీంతో సీఎం సిద్దరామయ్యనకు తాత్కాలిక ఉపశమనం లభించినట్లు అయింది.

# రిజర్వేషన్లపై రాహుల్ వ్యాఖ్యలు

- అవగాహన లేదని కొట్టిపారవేత
- ఘాటుగా స్పందించిన కేంద్రమంత్రి మేఘవాల్

**న్యూఢిల్లీ, ఆగస్టు 19 :** లేటరల్ ఎంట్రీ ద్వారా రిజర్వేషన్లకు మోదీ సర్కార్ తూట్లు పొడుస్తున్నదని విపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యల పట్ల కేంద్రమంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ అభ్యంతరం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ లోక్‌సభలో విపక్ష నేతని, ఆయన రాజ్యాంగ పదవిలో ఉన్నారని, బాధ్యతారహిత వ్యాఖ్యలు చేయడం ఆయనకు తగదని ఆక్షేపించారు. లేటరల్ ఎంట్రీ ద్వారా ఆరెస్సెస్ వ్యక్తులను ఉన్నత పదవుల్లో నియమిస్తారని రాహుల్ గాంధీ చెప్పడం ఆయన అవగాహనా రాహిత్యానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ సైతం లేటరల్ ఎంట్రీలో భాగమేనని గుర్తుచేశారు. 1976లో మీరు ఆయనను నేరుగా ఫైనాన్షియల్ సెక్రటరీగా ఎలా నియమించారని కేంద్ర మంత్రి ప్రశ్నించారు. మీ ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ కూడా లేటరల్ ఎంట్రీలో భాగమేనని అన్నారు. ఇలాంటి వందలాది ఉదాహరణలు కనిపిస్తాయని, లేటరల్ ఎంట్రీని తీసుకొచ్చిందే మీరని రాహుల్‌ను ఉద్దేశించి కేంద్ర మంత్రి పేర్కొన్నారు. లేటరల్ ఎంట్రీని మీరు ప్రారంభిస్తే దాన్ని మోదీ క్రమబద్ధీకరణ చేశారని చెప్పారు. 2005లో పరిపాలనా సంస్కరణల కమిషన్ ఏర్పాటైందని, దాని నివేదిక బయటకువచ్చిందని తెలిపారు. 2005 నుంచి యూపీఏ అధికారంలో ఉందని గుర్తుచేశారు. తాము రిజర్వేషన్లకు చరమగీతం పాడతామని చెబుతున్నారని, అసలు మీరు ఎప్పుడు నియామకాలు చేపట్టారని మీరు ఏం చేశారని కేంద్ర మంత్రి నిలదీశారు.

కాంగ్రెస్‌కు హఠాత్తుగా ఓబీసీలపై ప్రేమ పెరిగిపోయిందని ఎద్దేవా చేశారు. లోక్‌సభలో రాహుల్ గాంధీ స్వయంగా తాను ఓబీసీ రిజర్వేషన్‌కు వ్యతిరేకమని చెప్పారని, కానీ ఇప్పుడు కాంగ్రెస్‌కు ఓబీసీలపై ప్రేమ పుట్టుకొచ్చిందని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థులను కాంగ్రెస్ తప్పుదారిపట్టిస్తోందని కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ దుయ్యబట్టారు.

## క్యాబ్ డ్రైవర్ల పరిస్థితి దయనీయం

**న్యూఢిల్లీ :** క్యాబ్ డ్రైవర్ల పరిస్థితి దయనీయంగా మారుతోంది. రైడ్ బుక్ అయితేనే పని. లేదంటే లేదు.. తొలుత ఉబెర్, ఓలా ఇతర కంపెనీలు డ్రైవర్లకు మంచి కమిషన్ ఇచ్చేవి. తర్వాత కమిషన్లు తగ్గించాయి. రైడ్స్ ఆశించిన స్థాయిలో రావడం లేదు. మెట్రో పాలిటన్ సిటీలో కుటుంబాన్ని పోషించేంత ఆదాయం డ్రైవర్లు పొందడం లేదు. ఇదే విషయాన్ని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గుర్తు చేశారు. సోమవారం రాహుల్ గాంధీ ఉబెర్ క్యాబ్ బుక్ చేసుకొని ఢిల్లీలో ప్రయాణించారు. ఉత్తరప్రదేశ్ ఎటాహ్‌కు చెందిన డ్రైవర్ సునీల్ ఉపాధ్యాయత్‌లో 11 నిమిషాల పాటు మాట్లాడారు. డ్రైవర్ తన సమస్యలను రాహుల్ గాంధీకి వివరించారు. ఆ వీడియోను రాహుల్ గాంధీ సోషల్ మీడియా ఎక్స్‌లో ట్వీట్ చేశారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో క్యాబ్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించేందుకు స్పష్టమైన విధానాలను రూపొందిస్తామని రాహుల్ గాంధీ వివరించారు. క్యాబ్ డ్రైవర్ల సమస్యలపై కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుదిట్టమైన విధానాలు రూపొందించి న్యాయం చేస్తాయి అని' రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. డ్రైవర్ల జీవన ప్రమాణ స్థాయి పెంచేందుకు కృషి చేస్తామని రాహుల్ గాంధీ భరోసానిచ్చారు.

# కాశ్మీర్‌లో ఉగ్రవాదుల మెరుపుదాడి

(మొదటిపేజీ తరువాయి)

జమ్మూలోని కొండ ప్రాంతంలో ఉగ్రవాద వ్యతిరేక చర్యలకు భారత సైన్యం శ్రీకారం చుట్టింది. ఆ ప్రదేశంలో సీఆర్పీఎఫ్ పోస్ట్ ఏర్పాటు చేసేందుకు సన్నాహాకాలు చేస్తుంది. అందులోభాగంగా సీఆర్పీఎఫ్ బెటాలియన్.. సోమవారం ఆ ప్రాంతానికి చేరుకుంది. ఈ విషయాన్ని పసిగట్టిన ఉగ్రవాదులు.. సీఆర్పీఎఫ్ బృందంపై మెరుపు దాడికి దిగారు. మరోవైపు ఈ ఏడాది జూన్ నుంచి జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాద దాడుల సంఖ్య ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయి. ఈ దాడుల్లో పలువురు భారత సైన్యానికి చెందిన అధికారులే కాక.. జమ్మూ కశ్మీర్ పోలీసులు సైతం భారీ సంఖ్యలో మరణించారు. ఈ దాడులకు తామే బాధ్యులమంటూ ఇప్పటికే పాకిస్థాన్‌కు చెందిన జై షే మహమ్మద్ జేబు సంస్థ కాశ్మీర్ టైగర్ ప్రకటించిన విషయం విధితమే. ఇక జులై 8వ తేదీ కతువా జిల్లాలో ఆర్మీ కాన్వాయిపై ఉగ్రవాదులు దాడికి తెగబడ్డారు. ఈ ఘటనలో ఐదుగురు ఆర్మీ సిబ్బంది మరణించారు. అలాగే జులై 6వ తేదీ కుల్గాం జిల్లాలో రెండు వేర్వేరు ఉగ్రవాద దాడుల్లో ఆరుగురు తీవ్రవాదులు మృతి చెందగా, ఇద్దరు సైనికులు సైతం మృతి చెందారు. రాష్ట్రంలో ఉగ్రవాద దాడులు మరింత పెరగడంతో.. వాటిని అణిచివేసేందుకు మోదీ ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుంది. అందులో భాగంగా రాష్ట్రంలో ఉగ్రవాద దాడుల నిర్మూలనకు కఠిన చర్యలు అవలంభించాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఇప్పటికే ఆ రాష్ట్ర ఉన్నతాధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు కేంద్ర పాలిత ప్రాంతం జమ్మూ కశ్మీర్ అసెంబ్లీకి ఎన్నికల నగారా మోగింది. దీంతో బీజేపీ కీలక నేతలు ప్రధాని మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తోపాటు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సైతం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అలాగే ఇండియా కూటమిలోని కీలక నేతలు రాహుల్, ప్రియాంక సైతం ఆ రాష్ట్ర ఎన్నికల ప్రచారంలో పాల్గొనున్నారు. అలాంటి వేళ.. ఎక్కడ ఎటువంటి హింసాత్మక ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన భద్రత చర్యలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్లు తెలుస్తుంది.

# తిరుమలలో విజిలెన్స్ తనిఖీలు

## నకిలీ రూ.300 ప్రత్యేక దర్శన టికెట్లు స్వాధీనం

**తిరుమల, ప్రజానావ:** తిరుమలలో నకిలీ రూ. 300 ప్రత్యేక దర్శన టికెట్లను తితిదే విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. కలర్ జిరాక్స్ టికెట్లతో వెళ్తున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. వైకుంఠంలోని స్కానింగ్ చేసే దగ్గర రుద్రసాగర్ అనే వ్యక్తి చొరవతో నకిలీ టికెట్లతో కొందరు భక్తులు దర్శనం క్యూలోకి వెళ్లారు. విజిలెన్స్ అధికారులు పసిగట్టి వారిని అదుపులోకి తీసుకున్నారు. అమృత్ యాదవ్ అనే పాతనేరస్థుడు చెన్నైకి చెందిన మోహన్‌రాజ్ అనే వ్యక్తిని మోసం చేసి 4 టికెట్లకు గానూ రూ. 11వేలు వసూలు చేశాడు. ఆ మొత్తాన్ని రుద్రసాగర్‌తో కలిసి పంచుకున్నట్లు సమాచారం. నకిలీ టికెట్ల వ్యవహారంలో పలువురు ఏపీ టూరిజం, తితిదే కార్పొరేషన్ అధికారుల హస్తమున్నట్లు తెలుస్తోంది. విజిలెన్స్ అధికారుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన టూటౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



## రాజ్యసభ అభ్యర్థిగా

# సింఘ్వీ నామినేషన్

**కార్యక్రమంలో పాల్గొన్న సిఎం రేవంత్ మంత్రులు**

**హైదరాబాద్, ప్రజానావ:** కాంగ్రెస్ తరపున రాజ్యసభ అభ్యర్థిగా అభిషేక్ మను సింఘ్వీ నామినేషన్ దాఖలు చేశారు. కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీ పాల్గొన్నారు. రాజ్యసభలో తొమ్మిది రాష్ట్రాలకు చెందిన 12 స్థానాలకు సెప్టెంబరు 3న ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాజ్యసభ సభ్యులు పీయూష్ గోయల్, సర్బానంద సోనోవాల్, జ్యోతిరాదిత్య సింధియా, కామఖ్య ప్రసాద్, వివేక్ ఠాకుర్, రాజేభోస్లే, బిప్లబ్ కుమార్ దేబ్(భాజపా), మీసా భారతి(ఆర్జేడీ), దీపేంద్రసింగ్ హుడా, కె.సి.వేణుగోపాల్(కాంగ్రెస్) లోక్‌సభకు ఎన్నికయ్యారు. వారంతా రాజ్యసభ సభ్యత్వాలకు రాజీనామా చేశారు. ఒడిశాలో బీజేడీ ఎంపీ మమతా మొహంత తన పదవికి, పార్టీకి రాజీనామా చేశారు. తెలంగాణ నుంచి భారాస రాజ్యసభ సభ్యుడిగా ఉన్న కె.కేశవరావు సైతం కాంగ్రెస్‌లో చేరి పదవికి రాజీనామా చేశారు. దాంతో ఈ 12 ఖాళీలకు ఉప ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 21 వరకు నామినేషన్ల దాఖలుకు గడువు ఉంది. ఈ మేరకు తెలంగాణ నుంచి తమ అభ్యర్థిగా అభిషేక్ సింఘ్వీని కాంగ్రెస్ అధిష్ఠానం ఖరారు చేసింది. సుదీర్ఘకాలంగా ఆయన పార్టీకి సేవలందిస్తున్నారు. 2001 నుంచి కాంగ్రెస్ జాతీయ అధికార ప్రతినిధి గా పని చేస్తున్నారు. రెండు దఫాలు(2006, 2018)గా రాజ్యసభ సభ్యుడిగా కొనసాగారు. ఈ ఏడాది మార్చిలో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో హిమాచల్‌ప్రదేశ్ నుంచి పోటీచేసి భాజపా చేతిలో ఓడిపోయారు. తెలంగాణ నుంచి రాజ్యసభ సభ్యత్వం కోసం స్థానిక నా యకులు కొందరు ప్రయత్నించినా... జాతీ య రాజకీయాల్లో సింఘ్వీ సేవలు కాంగ్రెస్‌కు కీలకమైనందున ఆయన్నే అభ్యర్థిగా ఖరారు చేసినట్లు పార్టీ నేతలు వివరించారు. తెలంగా ణలో కే కేశవరావు తమ పదవులకు, పార్టీల కు రాజీనామాలు చేశారు. దాంతో దేశవ్యా ప్తంగా మొత్తం 12 రాజ్యసభ స్థానాలకు ఖాళీ లు ఏర్పడ్డాయి. ఈ ఖాళీ స్థానాలకు సెప్టెం బర్ 3న ఎన్నికలు జరగనున్నాయి. అభ్యర్థు లు నామినేషన్‌లు దాఖలు చేసేందుకు ఈ నెల 21 వరకు గడువు ఇచ్చారు. ఈ క్రమం లో తెలంగాణ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా అభిషేక్ మనుసింఘ్విని రంగంలోకి దించా రు. దాంతో ఇవాళ ఆయన నామినేషన్ దాఖ లు చేశారు. నామినేషన్ దాఖలుకు ముందు ఆయన అసెంబ్లీకి వెళ్లారు. అక్కడ తెలంగాణ మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వర్ రావు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సింఘ్వీకి స్వాగతం పలికారు. పూలమాల వేసి, కాంగ్రెస్ కండువా కప్పి సత్కరించారు.

# రుణమాఫీ కాలేదంటే..

# అరెస్ట్ చేస్తారా?

## కడుపు మండి ఆందోళన చేస్తే అరెస్ట్‌లా

## ప్రభుత్వ తీరుపై మండిపడ్డ హరీష్ రావు




**హైదరాబాద్, ప్రజానావ:** రుణమాఫీ కాలేదన్న రైతులను అరెస్టులు చేస్తారా అని ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజాపాలన అని ప్రచారం చేసుకుంటూ అప్రజాస్వామిక విధానాలను కాంగ్రెస్ ప్రభుత్వం అనుస రించడం సిగ్గుచేటని విమర్శించారు. రుణమాఫీ కాలేదని అదిలాబాద్ జిల్లా తలమడుగులో నిరసన తెలియచేస్తున్న రైతులను అరెస్టులు చేయడం హేయమైన చర్య అన్నారు. పోలీసు యాక్ట్ పేరు చెప్పి, జిల్లాలో నిరసనలు, ఆందోళ నలు చేయొద్దని పోలీసులు హుకుం జారీ చేయడం హక్కులను కాలరాయడమేనని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా శాంతియుతంగా నిరసన తెలియ చేస్తున్న రైతులను ముం దస్తుగా అదుపులోకి తీసుకుంటున్నారని, అరెస్టులు చేస్తు న్నారని వెల్లడించారు. ప్రభుత్వ అప్రజాస్వామిక వైఖరిని బీఆర్ఎస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రైతులు రుణమాఫీ కాకపోవడంతో కలెక్టరేట్లు, వ్యవసాయ కార్యాలయం, బ్యాంకుల చుట్టూ తిరిగి విసిగి వేసారి పోతున్నారని చెప్పారు. ఏం చేయాలో తెలియక చివరకు రోడెక్కి ఆందోళన చేస్తున్నారని తెలిపారు. అన్ని జిల్లాల్లో నూ ఇదే పరిస్థితి కనిపిస్తున్నదని వెల్లడించారు. ప్రభుత్వం రైతుల రుణమాఫీ సమస్యకు పరిష్కారం చూపకుండా, పోలీసులను పురమాయించి గొంతెత్తిన వారిని బెదిరించ డం, అణగదొక్కే ప్రయత్నం చేయడం దుర్మార్గమని విమర్శించారు. ఒకవైపు రైతుబంధు రాక, మ-రోవైపు రుణమాఫీ కాక అన్నదాత ఆవేదనలో ఉ న్నాడని చెప్పారు. వ్యవసాయ పనులు చేసుకోవాలా లేక రుణమాఫీ కోసం ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు చేయాలా అంటూ కన్నీరు పెట్టుకుంటున్నారని వెల్లడించారు. ఏకకాలంలో ఆగస్టు 15లోపు రు-ణమాఫీ చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఆచరణలో మాత్రం అట్టర్ అయ్యారని ఎద్దేవాచే శారు. నమ్మి ఓటేసినందుకు రైతన్నను నట్టేట ముంచారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ రైతుల పాలిట శాపంగా మారిందన్నారు. ఎద్దు ఏడ్చిన ఎవుసం, రైతు ఏడ్చిన రాజ్యం ఏనాడూ బాగుపడ్డట్లు చరిత్రలో లేదన్న విషయాన్ని కాంగ్రెస్ పాలకులు మరిచిపోయినట్లున్నారని చెప్పారు. ఇప్పటికైనా కండ్లుతెరిచి రైతులందరికీ రుణమాఫీ చేయాల ని, ఆందోళనలో ఉన్న రైతాంగానికి భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని మరోసారి డిమాండ్ చేశారు. అదిలాబాద్ సహా ఇతర జిల్లాల్లో రైతన్నలపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేదంటే అరెస్టు చేసిన రైతన్నలకు అండగా బీఆర్ఎస్ పార్టీ కార్యచరణ ప్రకటిస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## మహిళలపై అఘాయిత్యాలు

# ఇప్పుడు గుర్తుకు వచ్చాయా?

**ఘటనపై మహిళా కమిషన్ వెంటనే స్పందించదా?**
**మంత్రి సీతక్కకు కేటీఆర్ కౌంటర్**



**హైదరాబాద్, ప్రజానావ:** తెలంగాణలో కాంగ్రెస్.. బీఆర్ఎస్ నేతల మధ్య మాటల యుద్ధం నడుస్తూనే ఉంది. మొన్నటి వరకూ రుణమాఫీ, ఇప్పుడేమో మహిళల అఘాయిత్యాలపై ఇలా రోజుకో వ్యవహారంపై నేతలు మాటల తూటాలు పేల్చుకుంటూనే ఉన్నారు. తాజాగా.. మంత్రి సీతక్కకు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. సీతక్కకు ఎనిమిది నెలల తర్వాత అయినా మహిళలపై అఘాయిత్యాలు గుర్తుకు రావడం మంచిదని సెటైరికల్‌గా మాట్లాడారు. మహిళలపై అఘాయిత్యాలు జరిగితే ప్రభుత్వం, మహిళా కమిషన్ వెంటనే స్పందించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీరు దున్నపోతు మీద వాన పడినట్లుగా ఉందని తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ' చెంచు మహిళపై అఘాయి-త్యం జరిగితే మా నాయకులు వెళ్లే వరకూ పట్టించుకున్న వారు లేరు. షాద్‌నగర్‌లో ఒక దళిత మహిళపై అఘాయిత్యం జరిగితే మా నాయకులు వెళ్ళే వరకు పట్టించుకోలేదు. మేము గొడవ చేస్తే పోలీసు అధికారిని సస్పెండ్ చేశారు. మహిళలు, పిల్లలు, ప్రజలు శాంతియుతంగా బ్రతికే విధంగా మహిళా కమిషన్, ప్రభుత్వం చూసుకోవాలి. హైదరాబాద్ నగరంలో మర్డర్లు జరుగుతుంటే ఆపే తెలివి లేదు. అఘాయిత్యాలు పెరుగుతుంటే పట్టించుకునే నాథుడు లేడు. రాష్ట్రానికి హోంమంత్రి దిక్కు లేడు. నేను పొరపాటున నోరుజారి ఒక మాట అంటే క్షమాపణ చెప్పాను. ప్రపంచంలో ఇంతకంటే పెద్ద సమస్య లేనట్లు దాన్నే సమస్య చేస్తున్నారు. దానికి రాజకీయ రంగు పులుముతున్నారు. మీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అఘాయిత్యాలపై విచారణ జరపండి. అప్పుడు శాంతి భద్రతలు ఎలా ఉండనో ఎప్పుడు ఎలా ఉన్నాయో కమిషన్ వేయండి. షీ టీమ్స్ పెట్టింది ఎవరు..?. భరోసా కేంద్రాలు పెట్టింది ఎవరు..?. ఉమెన్స్ సేఫ్టీ వింగ్ స్టార్ట్ చేసింది ఎవరు..? దిశలాంటి ఘటనలో తెలంగాణ లాంటి న్యాయం చేయాలని కోల్‌కతా ఘటనలో కోరుతున్నారు. దట్ ఈజ్ కేసిఆర్, మీకు మాట్లాడే అర్హత ఉందా?. హత్యలు జరుగుతుంటే పట్టించుకునే నాథుడు లేడు. మీరు మాట్లాడతారా' అని సీతక్కతో పాటు ప్రభుత్వంపై కేటీఆర్ ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై నేరాలు పెరిగి పోయాయంటూ బీఆర్ఎస్ ఆరోపించిన సంగతి తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై సీతక్క మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి తొమ్మిదేండ్ల కాలంలో మొత్తం 1,57,610 కేసులు నమోదు అయ్యాయని లెక్కలు తీసి మరీ చెప్పారు. కేంద్ర హోంశాఖ పరిధిలోని నేషనల్ క్రైమ్ రికార్డుల బ్యూరో ఈ గణాంకాలను వెల్లడించిందని, ఇవన్నీ మహిళలపై జరిగిన నేరాలను పోలీసులు కేసులుగా నమోదు చేసినవేనని అన్నారు. మహిళా కమిషన్‌ను తాము కూడా కలుస్తామని.. గత బీఆర్ఎస్ పాలనలో జరిగిన నేరాలు వివరాలన్నింటినీ సమర్పిస్తామని సీతక్క అన్నారు. ఈ వ్యాఖ్యలకు ఒకరోజు ఆలస్యంగా స్పందించిన కేటీఆర్ పైవిధంగా కౌంటర్ ఇచ్చారు.

## ఇంద్రకీలాద్రి, శ్రీశైలంలకు

# పోటెత్తిన భక్తులు

**విజయవాడ, ప్రజానావ:** ప్రసిద్ధి పుణ్యక్షేత్ర ఇంద్రకీలాద్రి కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో పవిత్రోత్సవాలు రెండవ రోజు కొనసాగుతున్నాయి. పవిత్రోత్సవాల సందర్భంగా అన్ని ఆర్జిత సేవలను ఆలయ అధికారులు నిలిపివేశారు. ప్రతి ఏడాది శ్రావణమాసంలో పవిత్రోత్సవాలు జరుగతుండటం ఆనవాయితీగా వస్తోంది. ఏడాది కాలంలో ఆలయానికి ఎటువంటి అపరివితం జరిగిన వాటిని శుద్ధి చేసే కార్యక్రమంగా పవిత్రోత్సవాలు నిర్వహిస్తుంటారు. అమ్మవారి మూలవిరాట్‌తో పాటు ఆలయంలోని దేవతామూర్తులు అన్నిటికీ పవిత్ర ఉత్సవాల సమర్పణ చేస్తారు. మంగళవారం పూర్ణాహుతితో పవిత్ర ఉత్సవాలు ముగియనున్నాయి. శ్రావణమాసంలో నూతన వధూవరులకు ఉచిత ఆశీర్వచనం ప్రసాదాన్ని ఆలయ యాజమాన్యం అందిస్తోంది. ఇకపోతే నంద్యాల జిల్లాలోని శ్రీశైలం శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. శ్రావణ పౌర్ణమి పైగా సోమవారం కావడంతో భారీగా భక్తజనం తరలివచ్చారు. ఈ క్రమంలో శ్రీ స్వామి అమ్మవారి దర్శనానికి సుమారు 4 గంటల సమయం పట్టనుంది. నిన్న,నేడు భక్తులకు స్పర్శ దర్శనానికి కూడా అవకాశం కల్పించడంతో భక్తుల రద్దీ పెరిగింది.

### తిరుమలలో మొదలైన ప్రక్షాళన

**స్వామివారిని దర్శించుకున్న మంత్రి పయ్యావుల**

**తిరుమల, ప్రజానావ:** టీటీడీలో ప్రక్షాళన స్పష్టంగా కనపడిందని మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. భక్తులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా టిటిడి నడుచుకుంటోందని అన్నారు. గతంలో పోలిస్తే మార్పులు జరుగుతున్నాయని అన్నారు. తిరుమల శ్రీవారిని సోమవారం మంత్రి పయ్యావుల కేశవ్ దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మంత్రి పయ్యావుల మాట్లాడుతూ.. క్యూ లైనల్లో భక్తులకు టీటీడీ అన్నపానియాలను నిరంతరంగా పంపిణీ చేస్తుందని తెలిపారు. ధర్మపరిరక్షణలో భాగంగా తిరుమలలో మార్పు మొదలైందని వివరించారు. టీటీడీ కల్పిస్తున్న సౌకర్యాల పట్ల భక్తులు కూడా సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో కూడా మార్పు స్పష్టంగా కనపడతుందని అన్నారు. ప్రజలు స్వేచ్ఛగా తమ భావ వ్యక్తికరణను వ్యక్తం చేస్తున్నారని వెల్లడించారు. ప్రభుత్వానికి కూడా ప్రశ్నించే అవకాశం ప్రజలకు దక్కిందని వివరించారు. రాష్ట్రంలో పలు చోట్ల కొంతమంది వ్యక్తులు దగ్ధం చేయడాన్ని ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించిందని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు.

# ఆర్టీసీ బస్సులోనే ప్రసవం

**• డెలివరీలో సహాయం చేసిన కండక్టర్ • అభినందించిన ఎండి సజ్జనార్**



**గద్వాల, ప్రజానావ:** తాను గర్భిణీ అని తెలిసినా.. డెలివరీ టైం దగ్గర పడిందని తెలిసినా సోదరుడికి రాఖీ కట్టేందుకు ఓ సోదరి వెళ్తూ మార్గ మధ్యలోనే ప్రసవించారు. ఆర్టీసీ బస్‌లో ప్రసవ నొప్పులు రాగానే ఆమెను బస్సులో ప్రసవం చేశారు. సోదరుడికి రాఖీ కట్టేందుకు బయల్దేరిన నిండు చూలాలు.. బస్సులోనే ప్రసవించింది. సదరు బస్సులో లేడీ కండక్టర్‌తో పాటు ఓ నర్సు అందుబాటులో ఉండటంతో ఆమెకు దగ్గరుండి డెలివరీ చేయించారు. గద్వాల్ నుంచి వనపర్తి వెళ్లే ఆర్టీసీ బస్సులో ఈ ఘటన చోటు చేసుకుంది. గద్వాల డిపోనకు చెందిన గద్వాల -వనపర్తి రూట్ పల్లె వెలుగు బస్సులో సోమవారం ఉదయం సంధ్య అనే గర్భిణి తన సోదరులకు రాఖీ కట్టేందుకు వనపర్తికి వెళ్తున్నారు. బస్సు నాచహల్లి సమీపంలోకి రాగానే ఆమెకు పురిటినొప్పులు వచ్చాయి. వెంటనే అప్రమత్తమైన మహిళా కండక్టర్ భారతి బస్సును ఆపించారు. అదే బస్సులో ఉన్న ఒక నర్సు సాయంతో గర్భిణికి పురుడు పోశారు. సంధ్య పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చారు. 108 అంబులెన్స్‌ను పిలిచి తల్లీబిడ్డను స్థానిక ఆస్పత్రికి తరలించారు. తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. రాఖీ పండుగ నాడు బస్సులో డెలివరీ చేసి ఒక మహిళా కండక్టర్‌ను ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ప్రశంసించారు. మానవత్వం చాటుకున్నారని కితాబు ఇచ్చారు. జరిగిన విషయాన్ని ఎక్స్ వేదికగా వివరించారు. 'రక్షాబంధన్ రోజున బస్సులో గర్భిణికి పురుడు పోసిన కండక్టర్ భారతికి ఆర్టీసీ యాజమాన్యం తరపున అభినందనలు తెలిపారు. తాను సమయస్ఫూర్తితో వ్యవహరించి నర్సు సాయంతో సకాలంలో పురుడుపోయడం వల్లే తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చుతూనే.. సామాజిక బాధ్యతగా సేవాస్ఫూర్తిని ఆర్టీసీ ఉద్యోగులు చాటుతుండటం గొప్ప విషయం.' అని సజ్జనార్ అన్నారు.

## రుణమాఫీపై చర్చకు వస్తారా..?

**హరీష్ రావుకు కోదండరెడ్డి సవాల్**

**హైదరాబాద్, ప్రజానావ:** రైతు రుణమాఫీ గురించి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు ఎక్కడికి వస్తారో రండి.. చర్చ పెడదామని జాతీయ కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కోదండరెడ్డి అన్నారు. పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం రైతులకు చేసింది ఏంటని ప్రశ్నించారు. ఎనిమిది నెలల్లో రేవంత్ ప్రభుత్వం రైతులకు చేసింది ఏంటో డేటా తీసుకువస్తామని సవాల్ విసిరారు. 2018-24 వరకు వ్యవసాయేతర భూములకు రైతుబంధు రూ.25,676 కోట్లు ఇచ్చారని.. అందులో బీఆర్ఎస్ పార్టీ నాయకులకు ఎక్కువ మొత్తంలో డబ్బులు మళ్లాయని కోదండ రెడ్డి ఆరోపణలు చేశారు. సోమవారం గాంధీభవన్‌లో కోదండరెడ్డి మీడియాతో మాట్లాడుతూ... ఔటర్ రింగ్ రోడ్డుకు భూమి కోల్పోతే.. నష్టపరిహారం అప్పుడు వచ్చిందని అన్నారు. మొన్నటి వరకు కూడా రైతుబంధు వచ్చిందని చెప్పా రు. బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరి నాలుగు గోడల మధ్య కుర్చీని నిర్ణయాలను రేవంత్ ప్రభుత్వం తీసుకోదని స్పష్టం చేశారు. రైతులకు రూ.2లక్షల కన్న ఎక్కువ రుణం ఉంటే.. పైన ఉన్న మొత్తం చెల్లిస్తే.. రూ.2 లక్షల వరకు ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేస్తుందని కోదండ రెడ్డి స్పష్టం చేశారు. రైతాంగాన్ని అనవసరంగా కన్ఫ్యూజన్ చేయొద్దని సూచించారు.



# రక్షా బంధన్ అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక

### కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్

**కంటోన్మెంట్, ప్రజానావ:** అన్నా చెల్లెలు, అక్కా తమ్ముళ్ల ఆత్మీయ అనుబంధానికి ప్రతిక రక్షా బంధన్ అని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేశ్ అన్నారు. సోమవారం రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని పికెట్‌లోని తన క్యాంపు కార్యాయలంలో పలువురు మహిళలు ఎమ్మెల్యేకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ మహిళలను తమ సోదరీమణులుగా భావించి, వారికి అండగా ఉన్నప్పుడే నిజమైన సార్థకత లభిస్తుందన్నారు. సోదర సోదరీమణులు ఒకరినొక్కరూ అండగా ఉండి, అప్యాయతలు మెండు చేసుకొని కలిసిమెలిసి రాఖీ పౌర్ణమిని నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉందని, మహిళల సంక్షేమానికి కట్టుబడి అనేక పథకాలు రూపొందిం చిందని, ఉచిత బస్సుతో పాటు రూ.500కే గ్యాస్, వడ్డీలేకని డ్వాక్రా రుణాలు అందిస్తుందని గుర్తుచేశారు.

**మహా కుంభాభిషేకంలో పాల్గొనడం అదృష్టం..**

200 ఏళ్ల మహా కుంభాభిషేకంలో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నానని, ఆ భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ప్రజలపై ఉండాలని ఆంక్షిస్తున్నానని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. సోమవారం సికింద్రాబాద్ గణేశ్ దేవాలయాన్ని సందర్శించి 200 ఏళ్ల మహా కుంభాభిషేకంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ భగవతస్తున్ని కోరుకున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే వెంట ఆలయ మాజీ ఛైర్మన్ సత్యనారాయణ, సదానంద గౌడ్, అశోక్, వినోద్, శ్రీశైలం, భద్రీనాథ్ యాదవ్, తేజ్‌పాల్, ఆర్డీ నగేశ్ యాదవ్ పాల్గొన్నారు.

# ప్రజల కోసం పనిచేయడం ముఖ్యం

**హైదరాబాద్, ప్రజానావ:** ప్రభుత్వ ఉద్యోగులందరూ కలిసి రాష్ట్ర ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం సచివాలయంలో ఎస్పీడీసీల్‌లో పదోన్నతులు పొందిన అధికారులు, ఉద్యోగులు.. ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్కను అభినందించారు. ఈ సందర్భంగా ఉద్యోగులను ఉద్దేశించి భట్టి విక్రమార్క ప్రసంగించారు. ప్రజల జీవితాల్లో మార్పు అంటే వారి జీవనస్థితిగతులు మారడం, కొనుగోలు శక్తి పెరగడం, రాష్ట్ర సంపదలో అంతా భాగస్వాములు కావడం ఆ మార్పు వచ్చినప్పుడే పోరాడి తెచ్చుకున్న ప్రత్యేక రాష్ట్రానికి ఫలితం ఉంటుందన్నారు. ఉద్యోగులందరూ కూడా ఈ రాష్ట్రం నాది, ఈ ప్రభుత్వం నాది, ఈ రాష్ట్ర ప్రజలు నా వాళ్ళు, వాళ్ల సేవ కోసమే నేను నియమించబడ్డారని మీరంతా భావించాలని ఉద్యోగులు, అధికారులకు సూచించారు. ప్రభుత్వ పరంగా ఆర్థిక ఇబ్బందులు ఉన్న పదోన్నతులు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు.

# ధరణికి చరమగీతం

- నూతన రెవెన్యూ చట్టం - 2024ను తీసుకొస్తున్నాం
- రైతు సుభిక్షంగా ఉండాలన్నదే మా ప్రభుత్వం లక్ష్యం
- ఉద్యోగుల పనితీరు ఆధారంగానే ప్రమోషన్లు, పోస్టులు
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:** 'ధరణి' వల్ల రైతులు, ప్రజలు అనుభవిస్తున్న కష్టాలు, బాధలకు త్వరలోనే చరమగీతం పాడబోతున్నామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. కొత్త రెవెన్యూ చట్టం రెవెన్యూ వ్యవస్థను కంటికి రెప్పలా కాపాడుకుంటామని, రైతులకు ఏ భూమి చిక్కులు కూడా లేకుండా చేసే ఆదర్శవంతమైన నూతన రెవెన్యూ చట్టం – 2024ను తీసుకువస్తున్నామని ఆయన ప్రకటించారు. కొత్త రెవెన్యూ చట్టం ముసాయిదా చర్చాగోష్టి హరితప్లాజా హోటల్‌లో సోమవారం ట్రెసా (తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్) అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక పెద్దమనిషి, ఒక ఉన్నతాధికారి కలిసి కుట్రపూరితంగా రాత్రికి రాత్రి తీసుకొచ్చిన ధరణి వల్ల ప్రజలంతా ఇబ్బందులు పడ్డారన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో రైతు సుభిక్షంగా ఉండాలన్నదే తమ ప్రభుత్వం లక్ష్యమన్నారు. చట్టాలు సరిగ్గా చేయకపోతే, వాటి ఫలితాలు ఎలా ఉంటాయో గత ప్రభుత్వం తీసుకువచ్చిన 2020 రెవెన్యూ చట్టమే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనమన్నారు. సామాన్యుడి నుంచి మేధావి వరకు అన్ని వర్గాల అభిప్రాయాలను తీసుకోవడానికి ముసాయిదా చట్టాన్ని పబ్లిక్ డొమైన్‌లో పెట్టడంతో పాటు ఇటువంటి చర్చా వేదికలను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు.

**రెవెన్యూ కోర్టులు ఏర్పాటు**

రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ వ్యవస్థను మళ్లీ తీసుకువస్తామని అలాగే రెవెన్యూ కోర్టులను కూడా ఏర్పాటు చేస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేస్తామని, అలాగే రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కార విషయంలో సానుకూలంగా వ్యవహరిస్తామని ఆయన అన్నారు. కొత్త రెవెన్యూ చట్టం ఆమోదించుకోవాలనుకుంటే గత అసెంబ్లీలోనే జరిగేదని, కానీ, లొసుగులు లేని చట్టం తీసుకురావాలన్న ఉద్దేశంతో అందరి అభిప్రాయాలను తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. అలాగే రెవెన్యూ వ్యవస్థలోని సమస్యలు, పదోన్నతుల అంశాలు తమ దృష్టికి వచ్చిందని మంత్రి పొంగులేటి తెలిపారు. గత ప్రభుత్వంలో రెవెన్యూ మంత్రిని కలవాలంటేనే కనీసం వారం రోజులు పట్టేదని, కానీ, ప్రస్తుతం అటువంటి పరిస్థితి లేదన్నారు. తాము కలిసి పనిచేసే విషయంలో ఈ ప్రభుత్వానికి ఎలాంటి భేషజాలు లేవన్నారు. ఈ ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్న ఆలస్యం జరిగినా పక్కాగా ఉండేలా తీసుకుంటామన్నారు. గత సీఎం వ్యక్తిగత కారణాలతో వీఆర్వో, వీఆర్ఏలను ఇతర శాఖల్లోకి పంపించారని, కానీ, గ్రామానికి రెవెన్యూ శాఖకు సంబంధించిన అధికారి ఎవరైనా ఉన్నారా అనే ఆలోచన లేకపోవడం బాధాకరమన్నారు. పదోన్నతుల విషయంలో క్యాలెండర్ విడుదల చేయబోతున్నామని మంత్రి తెలిపారు. ఎవరి పైరవీలు అక్కర్లేకుండానే ఉద్యోగుల పని తీరు ఆధారంగా ప్రమోషన్లు, పోస్టులు ఇస్తామన్నారు. త్వరలోనే రెవెన్యూ ఉద్యోగ సంఘాలతో భేటీ అయి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీనిచ్చారు. ఈ చట్టం తయారు చేసే విషయంలో మరిన్ని సూచనలు చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. ఎవరికో లబ్ధి చేకూర్చడం కోసమే ఈ కొత్త చట్టం తీసుకురావడం లేదని, కేవలం రాష్ట్రంలో భూమి కలిగిన ప్రతి ఒక్కరికీ భరోసా కల్పించడం కోసమే ఈ కొత్త చట్టం తీసుకువస్తున్నామని మంత్రి తెలిపారు.

**వారిని తిరిగి రెవెన్యూ శాఖలోకి తీసుకోవాలి**

వీఆర్వోలుగా పనిచేసిన వారిని తిరిగి రెవెన్యూ శాఖలోకి తీసుకోవాలని ట్రెసా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గౌతమ్‌కుమార్ తదితరులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ వ్యవస్థపై గతంలో ఎన్నోసార్లు కుట్ర జరిగినా ఈ శాఖను కాపాడింది మాత్రం కాంగ్రెస్ పార్టీనేనని ట్రెసా ప్రతినిధులు చెప్పారు. గత ప్రభుత్వం తమను దొంగల్లా చిత్రీకరించిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తీసుకురాబోయే కొత్త రెవెన్యూ చట్టాన్ని గ్రామీణ స్థాయిలో రైతులకు మేలు చేకూర్చేలా పకడ్బందీగా అమలు చేసే బాధ్యత తీసుకుంటామని ట్రెసా ప్రతినిధులు మంత్రితో పేర్కొన్నారు. ఈ సమావేశంలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడు చంద్రమోహన్, భూ చట్టాల నిపుణులు భూమి సునీల్ తదితరులు పాల్గొన్నారు.



# హైదరాబాద్ విడిచి వెళ్లొద్దు

- ఫోన్ ట్యాపింగ్ కేసులో భుజంగరావుకు ఊరట
- 15రోజుల పాటు షరతులతో మధ్యంతర బెయిల్ మంజూరు

**ఖైరతాబాద్, ప్రజానావ:** రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏ2 నిందితుడిగా ఉన్న మాజీ అదనపు ఎస్పీ భుజంగరావుకు కోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అ నారోగ్యంతో బాధపడుతున్న తనకు బెయిల్ మంజూరు చేయాలం టూ ఆయన పెట్టుకున్న పిటిషన్‌ను విచారించిన నాంపల్లి కోర్టు 15 రోజుల పాటు షరతులతో కూడిన మధ్యంతర బెయిల్ ఇచ్చిం ది. కోర్టు ఆదేశాలు లేకుండా హైదరాబాద్‌ను విడిచి వెళ్లరాదని ఆదేశించింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఈ ఏడాది మార్చి 23న భుజంగరావు అరెస్ట్ అయ్యారు. బెయిల్ కోసం ఇప్పటికే ఆయన పలుమార్లు పెట్టుకున్న పిటిషన్లను కోర్టు కొట్టివేసింది. ఈ కేసులో తొలుత మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు అరెస్ట్ అయ్యారు. ఆయన ఇచ్చిన సమాచారంతో అదనపు ఎస్పీలు తిరుపతన్న, భుజంగరావులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇదే కేసులో ఏ1 నిందితుడిగా ఉన్న ప్రభాకర్‌రావు అమెరికాలో ఉన్నారు. ఆయన కోసం పోలీసులు రెడ్ కార్నర్ నోటీసు జారీ చేసిన విషయం తెలిసిందే.



# వారి మాయలో పడొద్దు

- సాంకేతిక కారణాలతో కొందరికి రుణమాఫీ జరగలేదు
- వారందరికీ నూటికి నూరు శాతం మాఫీ చేస్తాం
- రాజకీయ దురుద్దేశంతోనే విపక్షాల తప్పుడు ప్రచారం
- రైతులను మోసం చేయడమే బీఆర్ఎస్‌కు అలవాటే
- ప్రచారం కోసమే ఖర్గే, రాహుల్‌కు కేటీఆర్ లేఖ
- బీజేపీ ఏనాడూ రుణమాఫీపై మాట్లాడలేదు
- మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు

**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:** వ్యవసాయరంగానికి సంబంధించి పంట రుణాల మాఫీలో ఉత్పన్నమైన సమస్యలన్నీ పరిష్కరిస్తున్నట్టు రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. సోమవారం ఆయన జలసౌధలో ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాంకేతిక కారణాలతోనే కొందరికి రుణమాఫీ జరగలేదని, వారందరికీ నూటికి నూరు శాతం రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. రాజకీయ దురుద్దేశంతోనే విపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, వారి మాయలో పడొద్దని రైతులకు సూచించారు. ఆధార్, రేషన్‌కార్డు వివరాలు సరిగ్గాలేని దాదాపు ఐదు లక్షల మంది రైతుల సమాచారంపై స్పష్టత వచ్చాక వారికి కూడా రుణమాఫీ చేస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో జరిగిన రుణమాఫీ, దేశంలో ఇంతవరకు ఎప్పుడూ జరగలేదని అన్నారు. 2014 తర్వాత బీజేపీ ఎప్పుడూ రుణమాఫీ గురించి మాట్లాడలేదన్న ఆయన, పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న ఆ పార్టీ, రైతుల కోసం ఎలాంటి మంచి పనులు చేయలేదని విమర్శించారు. తెలంగాణ రైతులను రుణ విముక్తులను చేయాలన్న దృఢ సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం సాహసోపేతమైన నిర్ణయం తీసుకుందని చెప్పారు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల కొందరికి రుణమాఫీ జరగలేదని, వారికి కూడా నూటికి నూరు శాతం రుణమాఫీ చేస్తామని మంత్రి పునరుద్ఘటించారు. అధికారంలో ఉన్నా లేకపోయినా రైతులను మోసం చేయడమే బీఆర్ఎస్‌కు అలవాటన్న మంత్రి, వారి మోసపూరిత మాటలు నమ్మవద్దని రైతులను కోరారు. బీఆర్ఎస్ మళ్లీ వచ్చేది లేదు, సచ్చేది లేదని అన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీకి కేటీఆర్ లేఖ ప్రచారం కోసం మాత్రమేనని ఎద్దేవా చేశారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ఏనాడూ రుణమాఫీ కోసం మాట కూడా మాట్లాడలేదు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పి ఒక ఫ్లాగ్‌షిప్ స్లోగన్ పెట్టి రైతుల మేలు కోసం ఒక్క అడుగు వేయలేదు. కేవలం రాజకీయ దురుద్దేశంతోనే ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేయడం, గందరగోళ పరిస్థితులను చేస్తున్న విషయాలను యావత్తు తెలంగాణ రైతాంగం గమనించాలని మనవి చేస్తున్నామని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు.

**నిరంతరం ప్రక్రియ..**

రాష్ట్రంలో సుమారు 8లక్షల మంది రైతులు బ్యాంకుల ద్వారా రూ.2లక్షలకు పైగా రుణం తీసుకున్నారని మంత్రి తెలిపారు. వీరు కూడా రూ.2లక్షలకు పైగా ఉన్న మొత్తాన్ని బ్యాంకులో చెల్లిస్తే వెంటనే ప్రభుత్వం నుంచి కూడా రూ.2లక్షలు రైతు ఖాతాకు జమ అవుతాయన్నారు. వీటికి ఎగువంటి డెడ్‌లైన్ లేదన్నారు. రైతులు వారీ వసులుబాటును బట్టి రుణాలు చెల్లించుకోచ్చని తెలిపారు. రాష్ట్రంలో రైతలు ఆధార్ నెంబర్లలో తప్పుగా ఉన్నవాటి సంఖ్య 1.20లక్షల మేరకు ఉన్నాయని, బ్యాంకు ఖాతాల్లో పేర్లు తప్పులుగా ఉన్నవి మరో 1.60లక్షల మేరకు ఉన్నాయని, మొత్తంగా ఆధార్, రేషన్‌కార్డు వివరాలు సరిగా లేని దాదాపు 5 లక్షల మంది రైతుల సమాచారంపై స్పష్టత వచ్చాక వారికి కూడా రుణమాఫీ చేస్తామని భరోసా ఇచ్చారు. వాటిని సవరించడానికి ప్రక్రియ మొదలుపెట్టామని మంత్రి తెలిపారు. ఈ మేరకు ప్రతి మండలంలో మండల వ్యవసాయాధికారులకు బాధ్యతలు అప్పగించామన్నారు. వారు రుణమాఫీ కానీ రైతుల వివరాలను తీసుకొని పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తే రుణమాఫీ చేస్తామని వివరించారు. కొన్ని ఖాతాల్లో వివరాలు సరిగ్గా లేకపోవడం, రేషన్‌కార్డులు లేకపోవడం వల్ల రుణమాఫీ జరగలేదని మంత్రి తెలిపారు. మండల వ్యవసాయాధికారులు ఈ సమస్యలను పరిష్కరిస్తారని భరోసా ఇచ్చారు. పదేళ్లలో బీఆర్ఎస్ సర్కార్ రూ.26 వేల కోట్ల రుణమాఫీ చేస్తే, తాము అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే రుణమాఫీ కోసం రూ.26 వేల కోట్లు బడ్జెట్‌లో పెట్టామని గుర్తుచేశారు. అర్హత ఉన్న ప్రతి కర్షకుడికి కచ్చితంగా ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని, ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతూనే ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మంత్రులతోపాటు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు పాల్గొన్నారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..

విలేకరులు కావలెను

రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుతున్న ప్రజానావ తెలుగు దినపత్రికలో
పని చేయుటకు జర్నలిస్టులకు ఆహ్వానం.. జర్నలిస్టుగా రాణించాలనే తపన..
వార్తా సేకరణలో నేర్పరితనం ఉన్న వారికి సదావకాశం..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో
ఈ కింది మండలాలకు విలేకరులు కావలెను

1. సిరిసిల్ల ఆర్‌సి ఇన్‌చార్జి
2. సిరిసిల్ల టౌన్/రూరల్
3. వేములవాడ ఆర్‌సి ఇన్‌చార్జి
4. వేములవాడ టౌన్
5. వేములవాడ రూరల్
6. తంగళపల్లి
7. ఎల్లారెడ్డిపేట
8. ముస్తాబాద్
9. వీర్నపల్లి
10. గంభీరావుపేట
11. ఇల్లంతకుంట
12. కోనరావుపేట
13. రుద్రంగి
14. బోయినపల్లి

9676667020, 8688523585

# రక్షా'బంధనం'

**తమ్ముడికి రాఖీ కట్టేందుకు అక్కలను అనుమతించని హాస్టల్ సిబ్బంది**

**తండ్రి భుజాలపైకెక్కి కిటికీలోంచి రాఖీ కట్టించుకున్న తమ్ముడు**

**మంచిర్యాల జిల్లా రామక్రిష్ణాపూర్ సోషల్ వేల్ఫేర్ గురుకులంలో ఘటన**



**మంచిర్యాల బ్యూరో, ప్రజానావ:** రక్షా బంధన్ నాడు తోడబుట్టిన సోదరుడికి అక్కాచెల్లెళ్లు రాఖీ కట్టడం మన సంప్రదాయం. ఎంతో సంతోషంగా హాస్టల్‌లో ఉన్న అక్కలతో రాఖీ కట్టించుకుందామని తండ్రితో వచ్చిన ఓ బాలుడికి నిరాశే ఎదురైంది. అక్కడి అధికారులు, సిబ్బంది బాలుడిని హాస్టల్‌లోకి అనుమతించలేదు. చేసేదిలేక తండ్రి భుజాలపైకి ఎక్కి కిటికీలో నుంచి అక్కలతో రాఖీ కట్టించుకున్నాడు. ఈ ఘటన మంచిర్యాల జిల్లా రామక్రిష్ణాపూర్ సోషల్ వేల్ఫేర్ గురుకుల పాఠశాలలో చోటుచేసుకోగా, హాస్టల్ సిబ్బందిపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. దాసరి అశ్విక, సహస్ర అనే బాలికలిద్దరూ ఇక్కడి గురుకులంలో చదువు కుంటున్నారు. రాఖీ పండుగ రోజు తండ్రి తన తమ్ముడు జితేంద్రను తీసుకొని హాస్టల్‌కు వచ్చాడు. అయితే రాఖీ కట్టించుకునేందుకు బాలుడిని ఆ స్కూల్ మేనేజ్‌మెంట్, సిబ్బంది లోపలికి పంపేందుకు ససేమీరా అనడంతో చేసేదిలేక హాస్టల్ వెనుక వైపు వెళ్లి తండ్రి తన కుమారుడు జితేంద్రను భుజాలపై ఎత్తుకున్నాడు. అక్కడ ఉన్న కిటికీ నుంచే ఆ బాలికలిద్దరూ తమ సోదరుడు జితేంద్రకు రాఖీ కట్టారు. అనంతరం తండ్రి తెచ్చిన స్వీట్లను తమ్ముడికి తినిపించారు. అయితే రాఖీ కట్టించుకోవడానికి బాలుడిని ఎందుకు అనుమతించలేదంటూ స్కూల్ మేనేజ్‌మెంట్‌పై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఇదిలాఉంటే స్కూల్ మేనేజ్‌మెంట్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలనే డిమాండ్ ఊపందుకుంది.

# మీ రక్షణ.. మా బాధ్యత

- ఎల్లప్పుడూ మీకు అండగానే ఉంటాం
- రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్
- తంగళపల్లిలో రక్షాబంధన్ వేడుకల్లో పాల్గొన్న పోలీస్ అధికారులకు



**సిరిసిల్ల, ప్రజానావ:** ఎల్లప్పుడూ మేం మీకు అండగానే ఉంటామని, మీ రక్షణ.. మా బాధ్యత అని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. రక్షాబంధన్ సందర్భంగా సోమవారం తంగళపల్లి మండలం తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఫైన్ ఆర్ట్స్, డిగ్రీ కళాశాలను ఆయన పోలీస్ అధికారులతో కలిసి సందర్శించారు. అక్కడ విద్యార్థులను చూసిన ఎస్పీ రాఖీ పండుగ సందర్భంగా ఇంటికి పోలేదని బాధపడవద్దన్నారు. నేను పోలీస్ అధికారిగా రాలేదని మీ అందరికీ ఒక అన్నగా వచ్చానని అక్కాచెల్లెళ్ల స్థానంలో మీరంతా రాఖీ కట్టాలని నేను మీకు రక్షగా ఉంటానని అన్నారు. అనంతరం మాట్లాడుతూ 'మాది ఉమ్మడి కుటుంబం అని.. నాకు తొమ్మిది మంది అక్కచెల్లెళ్లు రాఖీ పండుగ సందర్భంగా రాఖీ కట్టేవారన్నారు. ఈరోజు నా దగ్గర ఎవరు లేరని.. నా అక్కాచెల్లెళ్ల స్థానంలో మీరు అందరూ నాకు రాఖీ కట్టాలని నేను మీకు రక్షగా ఉంటా'నని అన్నారు. జిల్లాలో మహిళల రక్షణకు అనేక కార్యక్రమాలు నిరహిస్తున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగా ఆపరేషన్ జ్వాలా కార్యక్రమంతో విద్యార్థినులకు సెల్ఫ్ డిఫెన్స్ పైన శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, విద్యార్థినులకు సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్ నేర్చుకొని పురుషుల నుంచి రక్షణ తీసుకునే స్థాయి నుంచి పురుషులను రక్షించే స్థాయి మహిళలకు ఎదగాలన్నారు. విద్యార్థినులకు పాఠశాల, కళాశాల విద్య చాలా ముఖ్యమైనదని.. బాగా చదువుకొని ఉన్నత స్థానాల్లో స్థిరపడి అమ్మానాన్నలకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఎస్పీ వెంట సీఐ మొగిలి, ఎస్ఐ సుధాకర్, కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది తదితరులున్నారు.

## గడువులోగా ప్రజావాణి అర్జీలు పరిష్కరించాలి

**ప్రజావాణిలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**సిరిసిల్ల, ప్రజానావ:** నిర్ణీత గడువులోగా అర్జీలు పరిష్కరించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయములోని తన ఛాంబర్లో జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలు సోమవారం స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చే ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్ లో పెట్టవద్దని అధికారులను ఆదేశించారు. కచ్చితంగా గడువులోగా పరిష్కరించాలని సూచించారు. సిరిసిల్ల, కోనరావుపేట, ఇల్లంతకుంట తహసీల్దార్ కార్యాలయాలు, సర్వే, మున్సిపల్ కమిషనర్ వేములవాడ, సెస్, విద్యా, ఉపాధి, వ్యవసాయ శాఖలకు ఒకటి చొప్పున దరఖాస్తులు వచ్చాయి.

## రాజన్న ఆలయంలో ఋగ్వేద, యజుర్వేద ఉపాకర్మ



**వేములవాడ, ప్రజానావ:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో ఋగ్వేద, యజుర్వేద ఉపాకర్మ సోమవారం జరిగింది. శ్రావణ మాసంలో వచ్చే శ్రవణ నక్షత్రం రోజున ఋగ్వేద బ్రాహ్మణోత్తములు, పౌర్ణమి నాడు యజుర్వేద బ్రాహ్మణోత్తములు నూతన యజ్ఞోపవీత ధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అద్దాల మండపంలో హెూమం నిర్వహించిన అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ధర్మగుండంలో ప్రత్యేక స్నానాలు ఆచరించి, భక్తిశ్రద్ధలతో హెూమాది కార్యక్రమాలు చేపట్టారు. నూతన యజ్ఞోపవీతానికి అలంకరణ చేసి, యజ్ఞోపవీతాలను వేసుకున్నారు.

అలాగే నాగిరెడ్డి మండపంలో యజుర్వేద బ్రాహ్మణుల నూతన యజ్ఞోపవీత ధారణ కార్యక్రమం జరిగింది.

## చందుర్తిలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలు



**చందుర్తి, ప్రజానావ:** రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండల కేంద్రంలో ఛాయాచిత్ర ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రాపెల్లి గంగాధర్, ప్రధాన కార్యదర్శి తాటికొండ నరేశ్, కోశాధికారి ఉదయ్ కుమార్, గౌరవాధ్యక్షుడు తౌటు సురేశ్, అసినిపర్తి కుమార్, ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి మహిపాల్, సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, నాయకులు గొట్టే ప్రభాకర్, పులి సత్యం, కమలాకర్, రాములు పాల్గొన్నారు.

## కోల్‌కతా ఘటనకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ




**చందుర్తి, ప్రజానావ:** కోల్‌కతాలో వైద్య విద్యార్థి హత్యాచారం ఘటనకు నిరసనగా రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం లింగంపేట గ్రామంలో సోమవారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని సనుగుల బస్టాండ్ నుంచి అంబేద్కర్ కూడలి వరకు ర్యాలీ చేపట్టిన అనంతరం వైద్య విద్యార్థినికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ యావత్ దేశమంతా తలదించుకునేలా వ్యవహరించిన కామాందులకు ఉరిశిక్ష వేయాలని డిమాండ్ చేశారు. ఈ ర్యాలీలో గ్రామ యూత్ సంఘాలు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



## 'చలో కలెక్టరేట్'ను విజయవంతం చేయాలి

**మాల మహానాడు సంఘం నాయకుల పిలుపు**

**వేములవాడ, ప్రజానావ:** ఈ నెల 22న జరిగే రాజన్న సిరిసిల్ల జిల్లా చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాల మహానాడు సంఘం నాయకుల పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వేములవాడ పట్టణంలో సోమవారం మీడియా సమావేశంలో నిర్వహించి, చలో కలెక్టరేట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణలో క్రిమిలేయర్ పేరుతో ఎస్సీల హక్కుగా ఉన్న రిజర్వేషన్ రద్దు చేసే కుట్రను బీజేపీ చేస్తుందని మండిపడ్డారు. అందుకు నిరసనగా చలో కలెక్టరేట్ కార్యక్రమంలో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగాన్ని మారుస్తామని ఆ పార్టీ నాయకులు ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే రాజాసింగ్ లు బహిరంగంగానే మాట్లాడారని గుర్తుచేశారు. కానీ ప్రజల దెబ్బకు తగినన్ని సీట్లు రాకపోవడంతో తోక ముడిచారని, ఎస్సీలను చీల్చడానికి నిరసనగా ఆగస్టు 22 ఉదయం 11 గంటలకు రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ కార్యదర్శి రాగుల రాములు, దళిత సంఘాల నాయకులు వేణు, నాయకులు లింబయ్య, రామచందర్ కౌన్సిలర్, మునీందర్ తదితరులున్నారు.

## బోరబండ ఇన్‌స్పెక్టర్‌ను విధుల నుంచి తొలగించాలి

**కరీంనగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన**




**కరీంనగర్, ప్రజానావ:** అకారణంగా కూకట్‌పల్లి న్యాయవాది సంతోష్‌పై దౌర్జన్యం చేసిన బోరబండ ఇన్‌స్పెక్టర్ జమాల్‌పై కేసు నమోదు చేసి, విధులను నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కరీంనగర్ జిల్లా కోర్టు న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కరీంనగర్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బేతి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ నిజనిజాలు తెలుసుకోకుండా న్యాయవాదిపై దౌర్జన్యంగా ప్రవర్తించడం దారుణమన్నారు. తక్షణమే డీజీపీ స్పందించి ఇన్‌స్పెక్టర్ జమాల్‌తో పాటు పోలీస్ సిబ్బందిపై కేసులు నమోదు చేసి వారిని విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసే బాధ్యత ముఖ్యమంత్రి, డీజీపీలే తీసుకోవాలని, లేదంటే రాష్ట్రవ్యాప్తంగా అన్ని కోర్టులను స్తంభింపజేసి విధులు బహిష్కరించి ఆందోనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు బెజ్జంకి శ్రీకాంత్, పస్తం ఆంజనేయులు, కొండ్ర లక్ష్మణ్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు కటకం శ్రవణ్ కుమార్, దాసరి రామ్ రెడ్డి, గుడిపాటి సత్యం రెడ్డి, కట్ట రమేశ్, వీరసుందర్ మల్యాల ప్రతాప్ పాల్గొన్నారు.




## అక్టోబర్ 4 నుంచి తిరుమల బ్రహ్మోత్సవాలు

**తిరుమల, ప్రజానావ:** లియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామి కొలువైన తిరుమలలో అక్టోబర్ 4 నుంచి 12వ తేదీ వరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. తొమ్మిది రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా సాగనున్నాయి. తిరుమల తిరుపతి దేవస్థానం ఏడాది పొడువునా 450 ఉత్సవాలు నిర్వహిస్తుంది. ఇందులో బ్రహ్మోత్సవాలకు ఎంతో విశిష్ఠత ఉన్నది. అక్టోబర్ 3న ఉత్సవాలకు అంకురార్పణ చేయనున్నారు. బ్రహ్మోత్సవాలు జరిగే రోజుల్లో స్వామివారు ఉదయం, రాత్రి వేళల్లో ఒక్కో వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించనున్నారు. 4న సాయంత్రం 5.45 గంటలకు ధ్వజారోహణం కార్యక్రమం జరుగుతంది. బ్రహ్మోత్సవాలకు ఆరంభానికి సూచికగా ధ్వజారోహణం నిర్వహిస్తారు. ధ్వజస్తంభంపైకి గరుడ పతాకం ఎగురవేసి బ్రహ్మోత్సవాలకు ముక్కోటి దేవతలకు ఆహ్వానం పలుకుతారు. ఈ సందర్భంగా రుత్వికులు వేదమంత్రాలతో దర్భ చాపను ధ్వజస్తంభం చుట్టూచుడతారు. ఇక రాత్రి 9 గంటల నుంచి 11 గంటల వరకు పెద్దశేష వాహన సేవపై తిరుమాడ వీధుల్లో విహరిస్తారు. రెండోరోజైన 5న ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు చిన్నశేష వాహనం, రాత్రి 7 గంటల నుంచి 9 వరకు హంస జరుగుతుంది. 6న ఉదయం సింహ వాహనసేవ, రాత్రి ముత్యపు పందిరి, నాలుగో రోజున ఉదయం కల్పవృక్షం వాహనం, రాత్రి సర్వభూపాల వాహన సేవపై శ్రీవారి భక్తులను అనుగ్రహిస్తారు. ఐదోరోజున ఉదయం మెహినీ అవతారం, సాయంత్రం 6.30 గంటల నుంచి 11.30 గంటల వరకు శ్రీవారి గరుడ వాహనంపై భక్తకోటిని కటాక్షిస్తారు. ఉత్సవాల్లో ఆరో రోజున ఉదయం హనుమంత వాహనసేవ, సాయంత్రం 4 గంటల నుంచి 5 వరకు స్వర్ణ రథం, రాత్రి 7 నుంచి 9 వరకు గజ వాహన సేవ జరుగుతుంది. ఏడో రోజున ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహన సేవలను నిర్వహిస్తారు. ఎనిమిదో రోజున ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వవాహన సేవ జరుగుతుంది. చివరి రోజైన తొమ్మిదో రోజున ఉదయం 6 నుంచి 9 గంటల వరకు చక్రస్నానం, రాత్రి 8.30 గంటల నుంచి 10.30 గంటల వరకు ధ్వజారోహణంతో ఉత్సవాలు ముగియనున్నాయి. బ్రహ్మోత్సవాల్లో రెండు, మూడు, నాలుగో రోజుల్లో మధ్యాహ్నం సమయంలో రంగనాయకుల మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఉత్సవమూర్తులకు స్నపనం తిరుమంజనం నిర్వహించనున్నారు. ఇక బ్రహ్మోత్సవాలకు తిరుమల తిరుపతి దేవస్థానం భారీ ఏర్పాట్లు చేస్తున్నది. ఉత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు తరలిరానున్నారు. ముఖ్యంగా బ్రహ్మోత్సవాల్లో కీలక ఘట్టమైన గరుడ వాహనసేవకు లక్షల్లో భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.



## మిస్టర్ బచ్చన్ అందరూ మెచ్చేలా ఉంది

దర్శకుడు హరీశ్ శంకర్ 'మిస్టర్ బచ్చన్' సినిమాకు వచ్చిన టాక్‌పై స్పందించారు. సినిమాలో మంచిని పట్టించుకోకుండా, ఒక్క పాయింట్‌ను ఆధారంగా విమర్శించడం కరెక్ట్ కాదన్నారు. అలాంటి వారినీ, ఆ విమర్శలను పట్టించుకోవలసిన అవసరం లేదన్నారు. 'సోషల్ మీడియాలో ట్రోల్స్ నాకు కొత్తేమీ కాదు. అలానే సోషల్ మీడియా మాత్రమే నా జీవితం కాదు. నేను ఆకాశం లాంటి వాడిని. ఉరుము వచ్చినా.. పిడుగు వచ్చినా ఇలానే ఉంటా. నా వ్యక్తిత్వం అలాంటిది అన్నారు. 'గతంలో రవితేజ నటించిన కొన్ని సినిమాలకు వచ్చిన స్పందనలు నన్ను నిరాశపరిచాయి. కానీ, ఆ దర్శకుల మీద లేని అటాక్ నాపై జరిగింది. కొందరు ఉద్దేశపూర్వకంగానే నన్ను నెగెటివ్‌గా ప్రచారం చేస్తున్నారు. ఇందులోని ఒక డ్యాన్స్ మూమెంట్‌ను ప్రధానంగా తీసుకుని విమర్శిస్తున్నారు. కానీ, ఇందులో మంచి డైలాగులు చాలా ఉన్నాయి. వాటిని పట్టించుకోవడం లేదు. 'కట్నం తీసుకొని కాపురం చేసే మగవాడు వ్యభిచారం చేసినట్లు లెక్క' అని రాశాను. దాన్ని పక్కన పెట్టేశారు. ఆ డైలాగు అమ్మాయిలకు చాలా నచ్చిందని నాకు ఫోన్ చేసి చెప్పారు. అలాగే హీరో ఓ సందర్భంలో హీరోయిన్‌తో 'నీకు నా ప్రేమ అర్థమయ్యేవరకు నిన్ను కదిలించను' అంటాడు. అమ్మాయిలు ఏ విషయంలోనైనా 'నో' చెబితే వాళ్ల నిర్ణయాన్ని గౌరవించాలనే ఉద్దేశంతో ఆ డైలాగు రాశాను. దీని గురించి కూడా ఎవరూ మాట్లాడలేదు. మంచిని పక్కనబెట్టి వాళ్లకు సౌలభ్యంగా ఉన్న వాటిని తీసుకుని విమర్శించే వాళ్లను పట్టించుకోవాల్సిన అవసరం లేదు' అని అన్నారు. వాటిలో ఉన్న కామన్ పాయింట్స్ నోట్ చేసుకున్నా. ఈ సినిమాపై అందరూ రాసిన రివ్యూలు చదివాను. సినిమా ఎలాఉందనే దానిపై మొదటిరోజే నిర్ణయం తీసుకోవడం సరైన పద్ధతేనా? సినిమా ఎలా ఉందని టీజర్, ట్రైలర్, పాటల ఆధారంగా ప్రేక్షకులు ఓ నిర్ణయానికి వస్తారు. జిక్కీ పాటలో లిరిక్స్ ఎంతోమంది ఎక్స్‌లో పోస్ట్ చేశారు. సినిమా కోసం టికెట్ కొని వచ్చిన ప్రతిఒక్కరి నిర్ణయాన్ని నేను గౌరవిస్తాను అన్నారు.

## పాత్రకున్న ప్రాధాన్యతను బట్టే నటిస్తా

### కొన్ని సినిమాల రిజెక్షన్‌పై కంగనా రనౌత్



అక్షయ్ కుమార్, రణ్‌బీర్ కపూర్ సినిమాలను తాను రిజెక్ట్ చేయడానికి గల కారణాన్ని చెప్పుకొచ్చారు బాలీవుడ్ నటి కంగనా రనౌత్. స్టార్ హీరో సినిమాలైనా తన పాత్ర నిడివి ఎక్కువ ఉంటేనే నటిస్తానని కంగనా రనౌత్ తేల్చి చెప్పారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ 'బాలీవుడ్‌లో టాప్‌లో ఉన్న హీరోల సినిమాల్లో నటించని కథానాయికలు ఎక్కువ రోజులు ఇండస్ట్రీలో కొనసాగలేరని అనుకుంటారు. కొందరు అలా క్రియేట్ చేసేశారు. కానీ, నేను చాలామంది స్టార్ హీరోల సినిమాలను రిజెక్ట్ చేశాను. బాలీవుడ్‌లో నాకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాను. అగ్రశ్రేణి నటిగా గుర్తింపు తెచ్చుకోవాలంటే స్టార్‌డమ్ ఉన్న హీరోలతో కలిసి నటించాల్సిన అవసరం లేదని నిరూపించాను. ఆ సినిమాల్లో స్త్రీ పాత్రలు కేవలం కొన్ని సన్నివేశాలు, పాటలకే పరిమితం చేశారు. అలాంటి పాత్రలు అయితే కచ్చితంగా నేను చేయనని చెప్పేశా. బాలీవుడ్‌లో ఉన్న ఖాన్స్ అందరూ నాతో స్నేహంగా ఉంటారు. ఎప్పుడూ తప్పుగా ప్రవర్తించలేదు. అయినా పాత్రల నిడివి తక్కువ ఉందని వాళ్ల సినిమాలు తిరస్కరించా. నా తర్వాత ఈ రంగానికి రాబోయే మహిళలకు దిశానిర్దేశర చేయాలనుకుంటున్నా. ఇండస్ట్రీలో ఏ ఖాన్, కపూర్ కుటుంబాలు మనకు విజయం తెచ్చిపెట్టవు. హీరోపై హీరోయిన్ సక్సెస్ ఆధారపడి ఉంటుందనే అపోహను వదిలేయండి' అని అన్నారు. తాజాగా కంగానా నటించిన చిత్రం ఎమర్జెన్సీ పలుమార్లు వాయిదాల తర్వాత సెప్టెంబర్ 6న ఈ చిత్రం విడుదల కానుంది. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జీవితం ఆధారంగా ఈ చిత్రం రూపొందింది. ఇందులో కథానాయికగానే కాకుండా దర్శకనిర్మాతగా కూడా కంగనా వ్యవహరించారు.




## కంగువతో పోటీ పడనున్న వెట్టయాన్

ఇండియన్ సూపర్ స్టార్ రజినీకాంత్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'వెట్టయాన్'. తెలుగులో వేటగాడు అని వస్తున్న ఈ సినిమాకు జై భీమ్ ఫేమ్ టి.జె.జ్ఞానవేల్ దర్శకత్వం వహిస్తున్నాడు. బాలీవుడ్ అగ్రనటుడు అమితాబ్ బచ్చన్, మలయాళ నటుడు ఫహద్ ఫాజిల్, రానా, మంజు వారియర్, రితికా సింగ్, దుషారా విజయన్ ఇందులో కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ చిత్రం నుంచి మేకర్స్ రిలీజ్ అప్‌డేట్ ఇచ్చారు. ఈ మూవీని మొదట 2024 దసరా కానుకగా విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ వెల్లడించిన విషయం తెలిసిందే. అయితే తేదీని మాత్రం అనౌన్స్ చేయలేదు. ఇప్పుడు తాజాగా తేదీని కూడా ఖరారు చేసినట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ సినిమాను అక్టోబర్ 10న విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. అయితే ఇదే రోజున కోలీవుడ్ నుంచి మరో పెద్ద సినిమా రాబోతుంది. తమిళ స్టార్ నటుడు సూర్య శివ కాంబోలో కంగువ అనే సినిమా వస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమాను అక్టోబర్ 10న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. అయితే ఇదే రోజున ఇప్పుడు రజినీకాంత్ వేటగాడు కూడా రాబోతుంది. దీంతో దసరా రోజు బిగ్గ్ ÷ట్ జరుగనున్నట్లు తెలుస్తుంది.

## దేవరతో తెలుగులోకి జాన్వీ ఎంట్రీ

జూనియర్ ఎన్టీఆర్, జాన్వీ కపూర్ జంటగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'దేవర' సినిమాతో బాలీవుడ్ ముద్దుగుమ్మ అతిలోక సుందరి శ్రీదేవి గారాల పట్టి జాన్వీ కపూర్ ఈ మూవీతో తెలుగు చిత్ర పరిశ్రమలోకి, సౌత్ సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెడుతోంది. 2018లో దడక్ అనే హిందీ చిత్రంతో సినిమాల్లోకి ఆరంగేట్రం చేసిన ఈ చిన్నది ఓ పది చిత్రాల వరకు నటించింది కానీ రావాల్సినంత గుర్తింపు దక్కించుకోలేక. ఒక్క హిట్ కొట్టలేక పోయింది. తన అందాలతో బాలీవుడ్‌లో నిత్యం వార్తల్లో నిలుస్తూ వచ్చిన ఈ సుందరి ఛాన్సులు దక్కించుకోవడంలో కాస్త వెనుకబడింది. అయితే తాజాగా ఈ అమ్మడు తెలుగు సినిమాల వైపు దృష్టి పెట్టడంతో ఒక్కసారిగా దేశవ్యాప్తంగా చర్చల్లోకి వచ్చింది. ఈ క్రమంలో ఎన్టీఆర్‌తో నటిస్తున్న సినిమా కాకుండా రామ్‌చరణ్‌తో ఓ సినిమా చేస్తూ హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా దేవర సినిమా నుంచి ఎన్టీఆర్, జాన్వీలపై చిత్రీకరించిన చుట్టమల్లే పాటను రెండు వారాల క్రితం విడుదల చేయగా సోషల్ మీడియాలో సునామీ సృష్టిస్తోంది. అంతేకాదు యూ ట్యూబ్‌లో ఈ పాట ఇప్పటికే 7 కోట్లకు పైగా వ్యూస్ దక్కించుకుని సరికొత్త రికార్డులను తిరగరాస్తూ ఓ సరికొత్త చరిత్రను లిఖిస్తోంది.






# ఆలయాలకు శ్రావణశోభ

## గోదావరి తీరాల్లో భక్తుల సందడి

**కరీంనగర్, ప్రజానావ:** శ్రావణ మాసం సోమవారం సందర్భంగా గోదావరి తీరంలో భక్తులు పోటెత్తారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, చేయించారు. వేములవాడ మొదలుకుని ధర్మపురి, కాళేశ్వరం, బాసర తదితర క్షేత్రాలకు భారీగా భక్తులు తరలివచ్చారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించారు. కాళేశ్వరంలో గోదావరి స్నానాలు చేసిన భక్తులు స్వామి దర్శనం చేసుకున్నారు. ధర్మపురిలో కూడా గోదావరి స్నానాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. గోదావరి కళకళలాడుతండడంతో ప్రజలు భారీగా తరలి వచ్చారు. బాసరలో కూడా అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. వేములవాడలో భారీగా భక్తులు తరలివచ్చారు. గుండంలో స్నానాలు ఆచరించి కోడె మొక్కులు తీర్చుకున్నారు. ఇకపోతే కోటిలింగాల గోదావరి తీరం భక్తులతో నిండిపోయింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ వాహనాల్లో అధిక సంఖ్యలో తరలివచ్చారు. గోదావరి నదిలో పుణ్యస్నానాలు చేశారు. ఆలయంలోని శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామిని దర్శించుకొని, మొక్కులు చెల్లించుకున్నారు.మెదక్ జిల్లా పాపన్నపేట మండల పరిధిలోని ఏడుపాయల దుర్గా మాత ఆలయం భక్తులతో సందడి నెలకొన్నది. వివిధ ప్రాంతాల నుంచి చేరుకున్న భక్తులు మంజీరా నదిలోని పాయల్లో పుణ్యస్నానాలు చేసి దుర్గామాతను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు శుక్రవారం అమ్మవారికి ఒడిబియ్యం, కుంకుమార్చనలు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఏడుపాయల్లో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా తగిన భద్రత చర్యలు చేపట్టారు. చిట్కుల్ గ్రామ శివారులోని చాముండేశ్వరీ ఆలయంలో భక్తుల సందడి నెలకొన్నది. హైదరాబాద్, నిజామాబాద్, సిద్దిపేట, జహీరాబాద్, నారాయణఖేడ్, సంగారెడ్డి తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయం సమీపంలో ఉన్న మంజీరానదిలో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకుని కుంకుమార్చన, ఒడిబియ్యం సమర్పించారు. భక్తులు ఆలయంలో అన్నదానంలో పాల్గొన్నారు.

# శ్రీవారి ఆలయంలో వైభవంగా శ్రావణ ఉపకర్మ



**తిరుమల, ప్రజానావ:** తిరుమల శ్రీవారి ఆలయంలో సోమవారం శ్రావణ పౌర్ణమి సందర్భంగా శ్రావణ ఉపకర్మ వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా ఉదయం 6 గంటలకు శ్రీ కృష్ణస్వామి వారిని భూవరహస్వామివారి ఆలయానికి ఊరేగింపుగా తీసుకువచ్చి స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్లు, పసుపు, చందనంలతో అభిషేకించారు. అనంతరం స్వామివారికి నూతన యజ్ఞోపవీతాన్ని సమర్పించి, ఆస్థానం నిర్వహించారు. అనంతరం స్వామివారు ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పేష్కర్ శ్రీ శ్రీహరి, అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల్లోకి కాంగ్రెస్ నేతలు

## నేడు ఊరూరా రాజీవ్ జయంతి ఉత్సవాలు

**నిజామాబాద్, ప్రజానావ:** స్థానిక ఎన్నికలే లక్ష్యంగా కాంగ్రెస్ నేతలు దృష్టి పెట్టారు. ఇప్పటి నుంచే ప్రచార రంగంలోకి దూసుకుని పోయేందుకు ప్లాన్ రెడీ చేస్తున్నారు. గ్రామాల్లో కాంగ్రెస్ నేతలు పర్యటించేలా చేస్తున్నారు. రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా సీనియర్ నేతలు కార్యకర్తలతో కలిసి కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈనెల 20న రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా నియోజకవర్గాల్లో కార్యాక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. గ్రామంలో ప్రజలను కలిసేలా ప్రణాళిక రూపొందించామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు స్థానికంగా సమావేశాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రచార భేరిని మోగించేందుకు కాంగ్రెస్ పార్టీ సన్నాహాలు చేస్తోంది. గ్రామగ్రామాన రాజీవ్ గాంధీ జయంతి ఉత్సవాలు జరపాలని సూచించారు. రాజీవ్ జయంతి సందర్భంగా మోగించనున్న ప్రచార భేరి కార్యక్రమంతో ప్రజల్లోకి వెళ్లేలా ప్లాన్ చేస్తున్నారు. నిత్యం ఇక ప్రజల్లో ఉంటూ కాంగ్రెస్‌ను ప్రజలకు చేరువ చేస్తామని మాజీమంత్రి షబ్బీర్ అలీ అన్నారు. రోజు ఏదో ఒక కార్యక్రమం ఏర్పాటు చేసుకోవాలని, పార్టీ క్యాడర్ ఎంత మంది కలిసివస్తారో తెలిసిపోతుందని నాయకులు నిర్ణయించినట్లు తెలిసింది. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు సర్వశక్తులు ఒడ్డాలని సూచించారు. సాధారణ ఎన్నికలకు ముందు సందడి చేయాలని భావిస్తున్నాయి.

# ఆస్పత్రిలోనే రాఖీ కట్టి కన్నుమూసిన యువతి

**మహబూబాబాద్, ప్రజానావ:** పండుగపూట మహబూబాబాద్ జిల్లాలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. హాస్పిటల్‌లో కొన ఊపిరితో ఉన్న ఓ యువతి తన సోదరులకు దవాఖానలోనే రాఖీ కట్టి కన్నుమూసింది వివరాల్లోకి వెళ్తే.. నర్సింహులపేట మండలం కోదాడలో డిప్లొమా చదువుతున్న ఓ యువతి(17) ప్రేమ పేరుతో ఓ ఆకతాయి వేధిస్తుండటంతో మనస్తాపం చెంది గడ్డిమందు తాగి ఆత్మ హత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం హాస్పిటల్‌లో చేర్పించారు. కొన ఊపిరితో ఉన్న తాను రక్షాబంధన్ వరకు ఉంటానో లేదోనని భావించి శనివారం రాత్రి తమ్ముడు, అన్నలకు రాఖీ కట్టి గంటల వ్యవధిలో తుదిశ్వాస విడిచింది. కండ్ల ముందే తమ కూతరు ప్రాణాలు కోల్పోవడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. కాగా, ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# రాష్ట్ర వ్యాప్తంగా రాఖీ సంబురాలు

- సీఎం రేవంత్‌కు రాఖీ కట్టిన సీతక్క తదితరులు
- కెటిఆర్‌కు రాఖీ కట్టిన బిఆర్ఎస్ మహిళా నేతలు
- చెల్లెలు కవితతో అనుబంధాన్ని గుర్తు చేసుకున్న కెటిఆర్
- మహిళలకు అండగా ఉంటానన్న ఎమ్మెల్యే హరీష్ రావు





**హైదరాబాద్, ప్రజానావ:** రాష్ట్ర వ్యాప్తంగా రాఖీ పండుగ సంబురాలు ఘనంగా కొనసాగాయి. జూబ్లీహిల్స్‌లో నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి సీతక్కతో పాటు పలువురు రాఖీ కట్టారు.రాఖీ పౌర్ణమి పర్వదినం సందర్భంగా జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి సీతక్క రాఖీ కట్టారు. సీతక్కతో పాటు ఎంపీ కావ్య, ఎమ్మెల్యేలు పర్ణిక రెడ్డి, రాగమయి, కార్పొరేషన్ చైర్మన్లు బండ్రు శోభారాణి, నెరేళ్ల శారద, కాల్వ సుజాత, తదితరులు రేవంత్ రెడ్డికి రాఖీలు కట్టారు. తనకు రాఖీలు కట్టిన మహిళా నేతలకు సీఎం ధన్యవాదాలు తెలిపారు. సోదరీ సోదరుల మధ్య అనురాగాలకు, ఆప్యాయతలకు ప్రతీక రాఖీ పండుగ అని మంత్రి సీతక్క అన్నారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. రాఖీ పండగ సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. అమ్మాయిలను గౌరవించుకోవాల్సిన అవసరాన్ని రాఖీ పండుగ చాటి చెబుతుందన్నారు. మహిళా భద్రతకు పాటుపడదామని రాఖీ పండుగ సందర్భంగా అందరూ ప్రతినభూనాలన్నారు. మహిళలను గౌరవించు కోవడం మన సంస్కృతి అని అన్నారు. ప్రతి అడపడుచు, అన్నదమ్ములతో ఎంతో ఉత్సాహాన్ని, ఆనందాన్ని పంచుకునే పండగ రాఖీ పండగ అని అన్నారు. సోదరులు అందరూ బాగుండాలని ప్రతి ఆడబిడ్డ కోరుకుంటుందని తెలిపారు. సమాజంలో వస్తున్న రకరకాల మార్పులు వల్ల మహిళల పట్ల అనేక రకాల హింస జరుగుతుందన్నారు. ప్రతి సోదరుడు తన సోదరికి సమాజంలో ఎలా సెక్యూరిటీ, గౌరవం పొందాలి అనుకుంటారో.. అలాగే ప్రతి ఒక్కరూ తమ అక్క చెల్లమ్మల మాదిరి సమాజంలో ప్రతి ఆడబిడ్డను గౌరవించాలని అన్నారు. ప్రతి మహిళను మన ఇంటి బిడ్డగా చూస్తే అఘాయిత్యాలు, అత్యాచారాలు జరగవన్నారు. ఆడబిడ్డలకు స్వేచ్ఛగా తిరేగే అవకాశం ఇద్దాం.. ఎదగనిద్దాం అంటూ అందరికీ రాఖి శుభాకాంక్షలు తెలిపారు. సీఎంకు కూడా రాఖీ కట్టి పండగ శుభాకాంక్షలు తెలిపానని.. చాలా సంతోషంగా ఉందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఇకపోతే తెలంగాణ భవన్‌లో రాఖీ పండుగ సంబురాలు ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మహిళా నేతలు రాఖీ కట్టారు. మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్యే కోవా లక్ష్మి, మాజీ విప్ గొంగిడి సునీత, ఇతర నేతలు కేటీఆర్‌కు రాఖీ కట్టి హారతిపట్టారు. మాజీ మంత్రి సత్యవతి.. అక్షింతలు వేసి కేటీఆర్‌ను ఆశీర్వదించారు. రాఖీ పండుగ సందర్భంగా దేశవ్యాప్తంగా ఘనంగా వేడుకలు జరుపుకుంటున్నారు. సాధారణ ప్రజలతోపాటు సినీ, రాజకీయ, వ్యాపార ప్రముఖులు కూడా రాఖీ వేడుకలు జరుపుకుంటున్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. జైల్లో ఉన్న తన సోదరి కల్వకుంట్ల కవిత ను ఉద్దేశించి తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఆవేదనతో కూడిన పోస్ట్ చేశారు. తన సోదరి కవిత ఈ రోజు తనకు రాఖీ కట్టలేకపోవచ్చునని, కానీ ఆమెకు ఏ కష్టమొచ్చినా తాను ఎల్లవేలలా అండగా ఉంటానని కేటీఆర్ పేర్కొన్నారు. 'ఈ రోజు నువ్వు రాఖీ కట్టలేకపోవచ్చు. కానీ నీకు కష్టమొచ్చినా నేను అండగా ఉంటా' అని ఆయన పోస్ట్ చేశారు. ఈ పోస్ట్‌కు లవ్ సింబల్‌ను జతచేశారు. గతంలో సోదరి కవిత తనకు రాఖీ కట్టిన ఫొటోను షేర్ చేశారు. బీఆర్ఎస్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు నివాసంలో రాఖీ పౌర్ణమి వేడుకలు నిర్వహించారు.









# అత్యంత పిన్న వయసులో భారత ప్రధానిగా రాజీవ్

- దేశంలో నవతరం నాయకుడిగా గుర్తింపు
- నేడు రాజీవ్ జయంతి



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 19 :** 40 ఏళ్ళ వయసులో భారత యువ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన రాజీవ్‌గాంధీ బహుశా ప్రపంచంలోనే అతి పిన్నవయస్కులైన ప్రభుత్వాధినేతల్లో ఒకరు కావచ్చు. 1984 అక్టోబర్ 31న తల్లి ఇందిరా గాంధీ దారుణ హత్యకు గురైన సమయంలో ప్రధాన మంత్రిగాను, కాంగ్రెస్ అధ్యక్షునిగాను ఆయన నిర్వర్తించాల్సి వచ్చింది. వ్యక్తిగత దుఃఖాన్ని, విచారాన్ని అణచుకొని జాతీయ బాధ్యతను ఎంతో హుందాగా, ఓర్పుగా తన భుజాలకు ఎత్తుకున్నారు. నెల రోజులపాటు నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో రాజీవ్‌గాంధీ దేశంలోని ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి అలుపు అలసట లేకుండా ప్రయాణించారు. అనేకచోట్ల 250 సభల్లో మాట్లాడారు. కోట్లాది మంది ప్రజలతో ముఖాముఖి జరిపారు. ఆధునిక భావాలు, నిర్ణయాత్మక శక్తి కలిగిన రాజీవ్‌గాంధీ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞాన ప్రపంచంలో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. తన ప్రధాన ఆశయాలలో భారత ఐక్యతను పరిరక్షిస్తూనే దేశాన్ని 21వ శతాబ్దంలోకి తీసుకువెళ్ళడం ముఖ్యమైనదని రాజీవ్ పదేపదే చెబుతూండేవారు. దేశంలో తరం మార్పుకు సంకేతంగా రాజీవ్‌గాంధీ దేశ చరిత్రలోనే అతిపెద్ద మెజార్టీ సాధించారు. హత్యకు గురైన తన తల్లి అంత్యక్రియలు పూర్తికాగానే ఆయన లోక్‌సభ ఎన్నికలకు ఆదేశించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అంతకుముందు 7 సార్లు జరిగిన ఎన్నికలలో కంటే అత్యధిక ఓట్లను సాధించింది. లోక్‌సభ సీట్లలో రికార్డుస్థాయిలో 401 సీట్లు గెలుచుకుంది. కోట్ల మంది భారతీయులకు నాయకునిగా అటువంటి శుభారంభం చేయడం అది ఎటువంటి పరిస్థితి అయినా చెప్పుకోదగిందే. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే రాజీవ్‌గాంధీ పూర్తిగా రాజకీయ కుటుంబానికి చెందినవారు అయినప్పటికీ ఆలస్యంగా, అయిష్టంగా రాజకీయాల్లో ప్రవేశించి కూడా ఇంత పెద్ద మెజార్టీ సాధించడం, స్వాతంత్ర ఉద్యమంలోను, ఆ తరువాత 4 తరాలపాటు భారతదేశానికి సేవలు అందించిన రాజకీయ కుటుంబానికి చెందిన రాజీవ్‌గాంధీ అనివార్య పరిస్థితుల్లోనే రాజకీయ ప్రవేశం చేశారు. రాజీవ్‌గాంధీ 1944 ఆగస్టు 20 బొంబేలో జన్మించారు. భారతదేశం స్వాతంత్యం÷-ర సాధించేనాటికి ఆయన తాత ప్రధానమంత్రి అయ్యేనాటికి రాజీవ్ వయసు కేవలం 3 సంవత్సరాలు. ఆయన తల్లిదండ్రులు లక్నో నుంచి ఢిల్లీకి మకాం మార్చారు. తండ్రి ఫిరోజ్ గాంధీ పార్లమెంటు సభ్యుడు అయ్యారు. నిర్భయంగా కష్టపడి పనిచేసే పార్లమెంటేరియన్‌గా పేరు తెచ్చుకున్నారు. రాజీవ్‌గాంధీ తన బాల్యాన్ని తాతగారితో కలసి తీన్‌మూర్తి హౌస్‌లో గడిపారు. అక్కడ ఇంధిరాగాంధీ ప్రధానమంత్రి సహాయకురాలిగా పనిచేశారు. డెహ్రాడూన్ లోని వెల్హామ్ ప్రెప్ స్కూల్‌కు కొద్దికాలంపాటు వెళ్ళిన రాజీవ్‌గాంధీ తరువాత రెసిడెన్షియల్ డూన్ స్కూల్‌కు మారారు. అక్కడ ఆయన అనేక మందితో ప్రగాఢ మైత్రిని పెంపొందించుకున్నారు. చిన్నతమ్ముడు సంజయ్‌గాంధీ కూడా ఆయనతో కలిశారు. స్కూల్ చదువు పూర్తయిన తరువాత రాజీవ్‌గాంధీ కేంబ్రిడ్జి ట్రినిటీ కళాశాలలో చేరారు. అయితే త్వరలోనే లండన్‌లోని ఇంపీరియల్ కాలేజ్‌కి మారారు. అక్కడ మెకానికల్ ఇంజినీరింగ్ కోర్సు చేశారు. రాజకీయాలను జీవిత వ్యాపకంగా మలచు కోవాలని ఆయన ఎప్పుడూ అనుకోలేదు. ఆసక్తి కూడా చూపలేదు. ఫిలాసఫీ, రాజకీయాలు లేదా చరిత్ర గురంచి ఆయన పట్టించుకునేవారు కాదు. అయితే సంగీతాన్ని ఇష్టపడేవారు. వెస్టర్న్, హిందూస్థానీ శాస్త్రీయ సంగీతంతోపాటు ఆధునిక సంగీతాన్ని కూడా ఇష్టపడేవారు. రాజీవ్ ఆసక్తి కనబబరిచే ఇతర అంశాల్లో ఫొటోగ్రఫీ, అమెచ్యూర్ రేడియో ముఖ్యమైనవి. కాగా, రాజీవ్‌కు అత్యంత ఇష్టమైనవి గాల్లో ప్రయాణించడం. ఇంగ్లండ్ నుంచి తిరిగివచ్చిన వెంటనే ఢిల్లీ ఫ్లయింగ్ క్లబ్ ఎంట్రన్స్ పరీక్ష పాసై కమర్షియల్ పైలెట్ లైసెన్సు తీసుకోవడానికి వెళ్ళారు. అనతికాలంలోనే దేశీ విమాన సంస్థ ఇండియన్ ఎయిర్‌లైన్స్ లో పైలెట్ జీవితం ప్రారంభించారు. కేంబ్రిడ్జ్ లో ఉన్న సమయంలో ఇంగ్లీష్ చదివే ఇటాలియన్ మహిళ సోనియా మైనోతో ఆయనకు పరిచయమయింది. 1968లో ఢిల్లీలో వారు ఇద్దరూ పెళ్ళి చేసుకున్నారు. ఇద్దరు పిల్లలు రాహుల్, ప్రియాంకతో కలసి వారు ఢిల్లీలో ఇందిరాగాంధీ ఇంట్లో నివాసం ఉన్నారు. చుట్టూ రాజకీయ కోలాహలం ఉన్నప్పటికీ వారిది మాత్రం పూర్తిగా వ్యక్తిగత జీవితం. కానీ, 1980లో సోదరుడు సంజయ్‌గాంధీ విమాన ప్రమాదంలో మరణించడంతో పరిస్థితి మారింది. అప్పట్లో అంతర్గతంగా, బహిర్గతంగా అనేక సవాళ్ళు చుట్టుముట్టిన పరిస్థితుల్లో తల్లికి చేయూతను ఇవ్వడానికి రాజకీయాల్లో చేరవలసిందిగా రాజీవ్‌గాంధీపై వత్తిడి పెరిగింది. మొదట్లో వీటిని ప్రతిఘటించినప్పటికీ తరువాత తల వొగ్గక తప్పలేదు. తమ్ముని మృతి కారణంగా ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో రాజీవ్‌గాంధీ గెలుపొందారు. 1982 నవంబర్‌లో భారత్ ఆసియా క్రీడలకు ఆతిథ్యం ఇచ్చినపుడు అంతకు చాలా సంవత్సరాల ముందు జరిగిన ఒప్పందానికి కట్టుబడి స్టేడియంలు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించే కార్యక్రమాన్ని రాజీవ్‌గాంధీ విజయవంతంగా పూర్తిచేశారు. వీటి పని సకాలంలో పూర్తయ్యేలా చూసే బాధ్యతను రాజీవ్‌గాంధీకి అప్పగించారు. ఈ లక్ష్యాన్ని విజయవంతంగా పూర్తిచేయడం ద్వారా రాజీవ్‌గాంధీ తన సామర్థ్యాన్ని, సమన్వయ స్ఫూర్తిని చాటుకున్నారు. అదే సమయంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసే పక్రియను తన భుజస్కంధాలపై వేసుకున్నారు. ఆ తరువాత కాలంలో అనేక పరీక్షా సమయాల్లో రాజీవ్‌గాంధీ శక్తి సామర్థ్యాలు, ప్రజ్ఞాపాటవాలు బయటపడుతూ వచ్చాయి.

# ఎల్బీ స్టేడియంలో ఘనంగా రాఖీ పండుగ

- చైర్మన్‌కు రాఖీ కట్టిన మహిళా ఉద్యోగినులు



**హైదరాబాద్ స్పోర్ట్స్, ప్రజానావ:** తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ప్రధాన కార్యాలయం ఎల్బీ స్టేడియంలో రాఖీ పండుగ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. వీసీ, ఎండీ ఏ.సోని బాలాదేవి, డిప్యూటీ డైరెక్టర్లు శ్రీలత, సుజాతలతో పాటు పలువురు మహిళా ఉద్యోగినులు చైర్మన్ కే. శివసేనారెడ్డికి రాఖీ కట్టారు. ఈ సందర్భంగా చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ స్పోర్ట్స్ అథారిటీ ఉద్యోగులంతా చిన్నాపెద్ద అనే తేడా లేకుండా ఒక కుటుంబ సభ్యుల్లా కలిసిమెలిసి పనిచేయాలని సూచించారు. ప్రతి పండుగను ఆనందోత్సవాల మధ్య జరుపుకుంటూ, పని ఒత్తిడి లేకుండా విధి నిర్వహణలో సమష్టి బాధ్యతలతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

# రోహిత్ నిర్ణయాలు ఎవరికీ అర్థం కావు

- అతడు చురుకైన కెప్టెన్
- భారత మాజీ బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్



**న్యూఢిల్లీ:** టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మపై భారత మాజీ బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్ ప్రశంసల వర్షం కురిపించాడు. రోహిత్‌లో అపార నాయకత్వ ప్రతిభ దాగివుందన్నాడు. మైదానంలో చాలా కామ్‌గా ఉన్నట్టు కనిపించే రోహిత్ సందర్భోచితంగా నిర్ణయాలు తీసుకోవడంలో ఎవరికీ అందనంత ఎత్తులో ఉంటాడని పేర్కొన్నాడు. మైదానంలో రోహిత్ మెదడు చాలా చురుగ్గా ఉంటుందన్నాడు. అతనికంటూ సొంత వ్యూహాలు ఉంటాయని, దాన్ని జట్టు విజయం కోసం వినియోగిస్తుంటాడని రాథోడ్ వివరించాడు. ఇక రోహిత్ తీసుకునే నిర్ణయాలు ఎవరికీ త్వరగా అర్థం కావన్నాడు. అతను తీసుకునే నిర్ణయాలు ఎప్పుడూ జట్టుకు ప్రయోజంగానే ఉంటాయన్నాడు. టీమిండియాకు లభించిన అత్యుత్తమ ఆటగాళ్లలో రోహిత్‌ది చాలా ప్రత్యేక స్థానమని విక్రమ్ కొనియాడాడు.



# క్రీడాకారులను ప్రోత్సహించాలి

**యువనేత తలసాని సాయికిరణ్ యాదవ్**

**మహిళా పవర్ లిఫ్టర్ వైష్ణవి మహేశ్‌కు రూ.2 లక్షల ఆర్థిక సాయం**

**హైదరాబాద్ స్పోర్ట్స్, ప్రజానావ :** క్రీడాకారులకు చేయూతను అందించడంతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహించాలని యువనేత తలసాని సాయి కిరణ్ యాదవ్ కోరారు. సోమవారం వెస్ట్ మారేడ్ పల్లి లోని తమ నివాసం వద్ద మహిళా పవర్ లిఫ్టర్ వైష్ణవి మహేష్ కు తలసాని ట్రస్ట్ ఆధ్వర్యంలో 2 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అక్టోబర్ 4 నుంచి 13వ తేదీ వరకు దక్షిణాఫ్రికాలో జరిగే కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు వైష్ణవి మహేశ్ ఎంపికైంది. ఈ పోటీలకు హాజరయ్యేందుకు ఆర్థికంగా కొంత ఇబ్బందిపడుతున్న విషయాన్ని తెలుసుకున్న తలసాని సాయి కిరణ్ యాదవ్ ఈ మేరకు తలసాని ట్రస్ట్ ద్వారా రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడంపై ఆమెకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ అనేకమంది నైపుణ్యం కలిగిన క్రీడాకారులు ఉన్నప్పటికీ, వారికి సరైన ప్రోత్సాహం లభించక పోవడంతో రాణించలేకపో తున్నారని విచారం వ్యక్తం చేశారు. వైష్ణవి మహేశ్‌ను గత ఐదేళ్లుగా పవర్ లిఫ్టర్‌గా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో ప్రతిభ చాటే విధంగా ప్రోత్సహించిన విషయాన్ని గుర్తు చేశారు. ఎప్పటికైనా అంతర్జాతీయ వేదికలపై వైష్ణవి మహేశ్‌కు తన సత్తా చాటే అవకాశం లభిస్తుందనే పూర్తి నమ్మకం తనకు ఉందన్నారు. ఎంతో కష్టపడి రాష్ట్ర, జాతీయ స్థాయిలలో మెడల్స్ సాధించిందని చెప్పారు. ఆమె కష్టానికి ఫలితంగా అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని తెలిపారు. కామన్వెల్త్ పోటీల్లోనూ తన ప్రతిభను చాటుతుందనే విశ్వా సాన్ని వ్యక్తం చేశారు. రక్షాబంధన్ ను పురస్కరించుకుని వైష్ణవి సాయి కిరణ్ యాదవ్‌కు రాఖీ కట్టింది.

### ప్రోత్సాహాన్ని మరువలేను : వైష్ణవి

పవర్ లిఫ్టింగ్‌లో తాను అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా తలసాని ట్రస్ట్, తలసాని సాయి కిరణ్ యాదవ్ అందించిన సాయం, ప్రోత్సాహాన్ని ఎన్నటికీ మరువలేనని పవర్ లిఫ్టర్ వైష్ణవి మహేశ్ అన్నారు. తాను పవర్ లిఫ్టర్ గా కెరియర్ ను ప్రారంభించిన నాటి నుంచి అనేక సందర్భాల్లో అన్ని విధాలుగా సహాయం అందిస్తూ వస్తున్నారని, అందుకు వారికి కృతజ్ఞతలు తెలిపింది. కామన్వెల్త్ పోటీల్లో మెడల్ ను సాధిస్తానని ధీమా వ్యక్తం చేసింది.



# ఆసీస్ సిరీస్‌కు షమీ

- అతడి అవసరం జట్టుకు ఉంది
- బీసీసీఐ కార్యదర్శి జైషా

**ముంబై:** రానున్న ఆస్ట్రేలియా సిరీస్‌లో టీమిండియా సీనియర్ బౌలర్ మహ్మద్ షమీ జట్టులోకి వస్తాడని భారత క్రికెట్ బోర్డు కార్యదర్శి జైషా జోస్యం చెప్పారు. షమీ ఈ సిరీస్‌లో ఆడతాడనే నమ్మకం తనకుందన్నారు. గాయాలతో సతమతమై కొంతకాలంగా టీమిండియాకు దూరంగా ఉన్న షమీ ప్రస్తుతం పూర్తి ఫిట్‌నెస్‌తో ఉన్నాడన్నారు. ఆస్ట్రేలియా సిరీస్‌లో షమీదే కీలక పాత్రగా ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. భారత ప్రధాన అస్త్రాల్లో షమీ ఒకడని, అతని అవసరం జట్టుకు ఎంతో ఉందన్నారు. ఇక త్వరలో ప్రారంభమయ్యే దులీప్ ట్రోఫీ ద్వారా ఆటగాళ్ల ఫామ్‌ను పరిశీలిస్తామన్నారు. ఇందులో రాణించిన ఆటగాళ్లను బంగ్లా సిరీస్‌కు ఎంపిక చేస్తామన్నారు. ఇక భారత్‌లో ప్రతిభావంతులైన క్రికెటర్లకు కొదవలేదని, ఒకే సమయంలో రెండు బలమైన జట్లను ఎంపిక చేసే సత్తా తమకుందని జైషా పేర్కొన్నారు.



## నేను పెద్దగా రాణించకపోవడంతో ఎంపిక చేయలేదు

**ముంబై:** సెప్టెంబర్ 5 నుంచి దేశవాళీ టోర్నీ దులీప్ ట్రోఫీ 2024 ఆరంభం కానుంది. ఈ టోర్నీలో బరిలోకి దిగే నాలుగు జట్లకు శుభ్‌మన్ గిల్, అభిమన్యు ఈశ్వరన్, రుతురాజ్ గైక్వాడ్, శ్రేయస్ అయ్యర్‌లు కెప్టెన్లుగా ఎంపికయ్యారు. దాదాపుగా అందరు భారత క్రికెటర్స్ దులీప్ ట్రోఫీలో ఆడుతున్నారు. సెంట్రల్ కాంట్రాక్ట్‌ను కోల్పోయిన వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ కూడా ఆడనున్నాడు. సీనియర్స్ విరా ట్ కోహ్లీ, రోహిత్ శర్మ, జస్ప్రీత్ బుమ్రా, ఆర్ అశ్విన్‌లు మొదటి రౌండ్‌లో ఆడనున్నట్లు తెలు స్తోంది. దులీప్ ట్రోఫీ 2024కి యువ బ్యాటర్ రింకు సింగ్‌ను బీసీసీఐ సెలెక్టర్లు ఎంపిక చేయలేదు. రింకును ఎందుకు తీసుకోలేదని సోషల్ మీడియాలో చర్చకు దారి తీసింది. తాజాగా ఈ విషయంపై రింకు స్పందించాడు. స్పోర్ట్స్ టుడేకి ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో రింకు మాట్లాడు తూ 'నేను గత దేశవాళీ సీజన్‌లో బాగా ఆడలేదు. రంజీ ట్రోఫీలో కూడా ఎక్కువ మ్యాచ్‌లు ఆడలేదు. కేవలం 2-3 మ్యాచ్‌లు మాత్రమే ఆడా. నేను పెద్దగా రాణించకపోవడంతో ఇప్పుడు ఎంపిక చేయలేదు. అయితే తప్పకుండా దులీప్ ట్రోఫీ రెండో రౌండ్‌కు ఎంపిక చేస్తారనే నమ్మకంతో ఉన్నా' అని చెప్పాడు. 2023లో ఇండియన్ ప్రీమి యర్ లీగ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ తరఫున రింకు సింగ్ అద్భుత ప్రదర్శన చేశాడు. 14 మ్యాచ్‌ల్లో 474 పరుగులు చేశాడు. ఆ ప్రదర్శనతో 2023 ఆగస్టులో ఐర్లాండ్‌పై అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. కొద్దికాలంలోనే టీమిండియా టీ20 మిడిల్ ఆర్డర్‌లో సెటిల్ అయ్యాడు.

# బంగ్లాలో కష్టమే

- మెగా టోర్నమెంట్ వేదికను మార్చాలి
- ఆస్ట్రేలియా మహిళా క్రికెట్ కెప్టెన్ అలీసా హీలీ



**మెల్‌బోర్న్:** మహిళల టీ20 ప్రపంచకప్ వేదికను బంగ్లాదేశ్ నుంచి వేరే దేశానికి మార్చడమే మంచిదని ఆస్ట్రేలియా మహిళా క్రికెట్ టీమ్ కెప్టెన్ అలీసా హీలీ అభిప్రాయపడింది. ప్రస్తుతం బంగ్లాదేశ్ కష్టాల్లో ఉందని, ఇలాంటి స్థితిలో ప్రపంచకప్ వంటి మెగా టోర్నమెంట్‌ను నిర్వహించడం వారికి చాలా కష్టంతో కూడుకున్న అంశమని పేర్కొంది. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకుని వేదికను వేరే దేశానికి మార్చితేనే బాగుంటుందని తెలిపింది. యూఏఈ, శ్రీలంక, భారత్ తదితర దేశాల్లో ఎక్కడ నిర్వహించినా ఎవరికీ అభ్యంతరం ఉండదని వివరించింది. అంతర్గత వ్యవహారాలతో ఇబ్బందుల్లో ఉన్న బంగ్లాదేశ్‌లో వరల్డ్‌కప్ టోర్నీ నిర్వహిస్తే భద్రతాపరమైన ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని హీలీ ఆందోళన వ్యక్తం చేసింది. దీంతో అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఈ విషయంలో సాధ్యమైనంత త్వరగా ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని హీలీ సూచించింది.

WANTED

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్ /
జిల్లా ఇంచార్జీలు కావలెను



కరీంనగర్, జగిత్యాల, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్, సంగారెడ్డి, సూర్యాపేట, జోగులాంబ గద్వాల

అనతికాలంలో తెలుగు రాష్ట్రాల్లో సంచలన కథనాలు అందిస్తూ విశేష ప్రజాదరణ పొందిన 'ప్రజానావ' తెలుగు దినపత్రిక లో పనిచేయుటకు అన్ని జిల్లాల నుంచి స్టాఫ్ రిపోర్టర్ /జిల్లా ఇన్‌చార్జీలను ఆహ్వానిస్తోంది. అనుభవం, తెలుగు భాషపై పట్టు ఉన్న వారు.. ఆసక్తి గల వారు సంప్రదించవచ్చు.

సంప్రదించాల్సిన నెంబర్లు:
8185093931, 96766 67020, 72888 25681

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం

త్వరలో 'ప్రజానావ' సంస్థ ఆధ్వర్యంలో జర్నలిజం యందు శిక్షణ తరగతులు నిర్వహించబడును.

Printed, Published and Owned by Adula Thirupathi, Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2-5-23, Mudhiraj street, Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi.** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. RNI NO: TELTEL/2023/87657